


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 24 | సంచిక : 18 | ది. 14-3-2025 | విజయవాడ | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-

## ఢిల్లీకి రాజు అయిన తల్లికి కొడుకే....



హైదరాబాద్, మార్చి 13 (వార్తాప్రభ) : తన అమ్మ జానకమ్మ చేతుల మీదుగా సతీమణి నాగమణి తోడుగా అసెంబ్లీ ఎన్నికల అధికారి చేతుల మీదుగా ఎమ్మెల్సీ పత్రాన్ని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అందుకున్నారు.

# రూ.1,21,659 కోట్ల పెట్టుబడులకు ఆమోదం



- 10 కొత్త ప్రాజెక్టుల ద్వారా 80,104 మందికి ఉద్యోగాలు
- వివిధ సంస్థల పెట్టుబడులు, ప్రాజెక్టుల పురోగతిపై ట్రాకింగ్
- 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు... ముందుగా 26 జిల్లాల్లో ఏర్పాటు
- నెల రోజుల్లో రాష్ట్రంలో ఐదు చోట్ల 5 రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలు
- ఎస్ఐపిబి సమావేశంలో అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం

**అమరావతి, మార్చి 13 (వార్తాప్రభ) :** రాష్ట్రానికి పెట్టుబడుల విషయంలో ఒప్పందం చేసుకున్న పరిశ్రమలు వెంటనే గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఆమోదం తెలిపిన, ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టుల పురోగతిపై నిత్యం పరిశీలించాలని... దీని కోసం ట్రాకర్‌ను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని సిఎం ఆదేశించారు. గురువారం సచివాలయంలో తన అధ్యక్షతన జరిగిన 4వ ఎస్ఐపీబీ సమావేశంలో ముఖ్యమంత్రి రాష్ట్రానికి కొత్తగా వస్తున్న పెట్టుబడుల ప్రతిపాదనలను పరిశీలించారు. పరిశ్రమలు, విద్యుత్, పర్యాటకం వంటి రంగాల్లో మొత్తం 10 సంస్థలు రూ.1,21,659 కోట్లు పెట్టుబడులు ముందుకురాగా ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 80,104 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. అలాగే, గత మూడు ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టులు, వాటి పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ చొప్పున మొత్తం 175 నియోజవకర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందలో భాగంగా మొదట జిల్లాకు ఒకటి చొప్పున 26 జిల్లాల్లో తక్షణం 26 ఎంఎస్ఎంఈ పార్కులు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే ప్రతిపాదించిన రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలను నెలరోజుల్లోగా రాష్ట్రంలోని 5 ప్రాంతాల్లో 5 సెంటర్లు నెలకొల్పాలని చెప్పారు. పెట్టుబడులు గ్రౌండ్ అయ్యే వరకు ఆయా సంస్థల వెనకపడాలని.... నిరంతరం ఫాలోఅప్ చేయాలని సిఎం సూచించారు. ఒప్పందాలు చేసుకున్న సంస్థలకు వేగంగా అనుమతులు ఇవ్వడంతో పాటు... క్షేత్రస్థాయిలో ఆయా ప్రాజెక్టులు పనులు మొదలుపెట్టేలా చూడాలన్నారు. ఈ విషయంలో అటు మంత్రులు, ఇటు అధికారులు మరింత వేగంగా పనిచేయాలని సిఎం సూచించారు. అప్పుడే ప్రతి ఏడాది ప్రగతి, ఫలితం కనిపిస్తుందని సిఎం అభిప్రాయపడ్డారు.

**4వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన సంస్థల వివరాలు :** 1) ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ : నాయుడుపేట - రూ.1,742 కోట్ల పెట్టుబడులు, 2,000 ఉద్యోగాలు. 2) దాల్మియా సిమెంట్ : కడప జిల్లా - రూ.2,883 కోట్ల పెట్టుబడులు, 354 ఉద్యోగాలు. 3) లులూ గ్లోబల్ ఇంటర్నేషనల్ : విశాఖపట్నం - రూ. 1,500 కోట్ల పెట్టుబడులు. 4) సత్యవీడు రిజర్వ్ ఇన్ఫ్రాసిటీ ప్రైవేట్ లిమిటెడ్ : శ్రీసిటీ %-% రూ. 25,000 కోట్ల పెట్టుబడులు, 50,000 ఉద్యోగాలు. 5) ఇండోసాల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ : రూ.58,469 కోట్ల పెట్టుబడులు, 13,050 ఉద్యోగాలు. 6) బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ : రూ.1,175 కోట్లు, 1,500 ఉద్యోగాలు. 7) ఏపీ ఎన్జీఈఎల్ హరిత్ అమ్రిత్ లిమిటెడ్ : అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు %-% రూ.22,000 కోట్ల పెట్టుబడులు, 8,300 ఉద్యోగాలు 8) ఆస్తా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ : అన్నమయ్య, కడప జిల్లాలు %-% రూ.8,240 కోట్లు, 4,000 ఉద్యోగాలు. 9) మేఫెయిర్ బీచ్ రిసార్ట్స్, కన్వెన్షన్ : రూ. 400 కోట్ల పెట్టుబడులు, 750 ఉద్యోగాలు. 10) ఒబెరాయ్ విలాస్ రిసార్ట్ : రూ. 250 కోట్ల పెట్టుబడులు, 150 ఉద్యోగాలు. గత మూడు ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం తెలిపిన పెట్టుబడుల వివరాలు ఇలా ఉన్నాయి.

**మొదటి ఎస్ఐపీబీ సమావేశం :** విద్యుత్ రంగంలో రూ.11,902 కోట్లు, ఇతర రంగాల్లో రూ.72,085 కోట్లు... మొత్తం రూ. 83,987 కోట్లు ఆమోదం తెలిపింది. దీంతో 29,585 మందికి ఉద్యోగ అవకాశాలు.

**రెండవ ఎస్ఐపీబీ సమావేశం :** విద్యుత్ రంగంలో రూ.83,000 కోట్లు, ఇతర రంగాల్లో రూ.99,162 కోట్లు... మొత్తం రూ. 1,82,162 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ పెట్టుబడులతో 2,63,411 మందికి ఉద్యోగ అవకాశాలు.

**మూడవ ఎస్ఐపీబీ సమావేశం :** విద్యుత్ రంగంలో రూ.42,932 కోట్లు, ఇతర రంగాల్లో 1,844 కోట్లు... మొత్తం రూ. 44,776 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. వీటి రాకతో 19,580 ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటివరకు నాలుగు ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.4,32,584 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా మొత్తం 3,92,680 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. 150 ఉద్యోగాలు. గత మూడు ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం తెలిపిన పెట్టుబడుల వివరాలు ఇలా ఉన్నాయి.

# ఎవరి ట్రాప్‌లోనూ పడను - తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి



**న్యూఢిల్లీ,మార్చి 13 (వార్తాప్రభ) :** గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధముందని, ఫొటోలు దిగి చూపించుకోవాల్సిన అవసరం లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తానెవరో తెలియకుండానే పీసీసీ అధ్యక్షుడు, సీఎం పదవులకు ఎంపిక చేస్తారా? అని ప్రశ్నించారు. ఎవరి ట్రాప్‌లోనూ తాను పడనన్నారు. విదేశాంగ మంత్రి జైశంకర్‌ను కలిసేందుకు దిల్లీ చేరుకున్న సందర్భంగా సీఎం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ గవర్నర్ ప్రసంగానికి రావడం కాదని.. అసెంబ్లీలో చర్చకు హాజరుకావాలన్నారు. డీలిమిటేషన్.. లిమిటేషన్ ఫర్ సౌత్ అని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి రావాల్సిన వాటిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. ఆయా అంశాలు సాధించుకురావాలనే ఆయన్ను ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు.

**'భారత్ సమ్మిట్'కు క్లియరెన్స్ కోసమే జైశంకర్‌ను కలుస్తున్నా..**

తెలంగాణలో 'భారత్ సమ్మిట్' పేరిట ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సీఎం తెలిపారు. సుమారు 60 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ సమ్మిట్‌కు అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తదితరులు హాజరయ్యే అవకాశముందని చెప్పారు. భారత్ సమ్మిట్‌కు కేంద్ర ప్రభుత్వం క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుందని.. ఆ విషయంపైనే విదేశాంగ మంత్రి జైశంకర్‌ను కలుస్తున్నట్లు సీఎం తెలిపారు. రాష్ట్రంలో 'మిస్ వరల్డ్' పోటీలు జరగనున్నాయని.. నెలరోజుల పాటు దీనికి సంబంధించిన కార్యక్రమాలు ఉంటాయన్నారు. దీనికోసం రెండు రోజుల్లో అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

# ఎమ్మెల్సీగా నాగబాబు ఏకగ్రీవం.. మరో నలుగురు కూడా..





**అమరావతి,మార్చి 13 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్‌లో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. జనసేన పార్టీ తరపున కొణిదెల నాగబాబు, తెలుగుదేశం పార్టీ నుంచి బీదా రవి చంద్ర, బీటీ రాయుడు, కావలి గ్రీష్మ, బీజేపీ నుంచి సోము వీర్రాజు నామినేషన్లు దాఖలు చేశారు. తాజాగా.. వీరంతా ఎమ్మెల్సీలుగా ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. గురువారం రిటర్నింగ్ అధికారి నుంచి వీరంతా ధృవీకరణ పత్రాలు అందుకున్నారు. కాగా, ఈ దఫాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కాగా, పొత్తు ధర్మంలో భాగంగా తెలుగుదేశం మూడు స్థానాలతో సరిపెట్టుకుంది. మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలకు చెరో స్థానాన్ని కేటాయించింది. జనసేన తరపున ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోదరుడు కొణిదెల నాగబాబును ఆ పార్టీ తరపున ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. మరోవైపు ఇప్పటికే నాగబాబుకు కేబినెట్‌లో చోటు కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే.

# నాగం గారూ.... ఎలా ఉన్నారు? ఆరోగ్యం ఎలా ఉంది?

- తెలంగాణ సీనియర్ నేత, మాజీ మంత్రి జనార్ధన్ రెడ్డికి సిఎం చంద్రబాబు ఆత్మీయ పలకరింపు



**అమరావతి,మార్చి 13 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘ కాలం పనిచేసిన సీనియర్ నేత, మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి ఎపి సిఎం చంద్రబాబు నాయుడును అసెంబ్లీలో కలిశారు. చాలాకాలం తరువాత తనను కలిసిన నాగంను సీఎం చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు. నాగం గారూ...ఎలా ఉన్నారు....ఆరోగ్యం ఎలా ఉంది...చాలా రోజులు అయ్యింది కలిసి అంటూ పలకరించారు. పిల్లలు ఏం చేస్తున్నారు అని ఆరా తీశారు. నాగం కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్న చంద్రబాబు...ఆరోగ్యం కాపాడుకోవాలని ఆయనకు సూచించారు. ఓబులాపురం మైనింగ్ అంశంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం నేతలు చేసిన ఉద్యమాలపై నాడు కేసులు నమోదు అయ్యాయి. ఆ కేసుల విచారణలో భాగంగా విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టుకు నాగం జనార్ధన్ రెడ్డి గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా జనార్ధన్ రెడ్డి అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆనాటి కేసులను ఎట్టకేలకు కొట్టివేయడంపై చంద్రబాబు హర్షం వ్యక్తంచేశారు. భేటీ సందర్భంగా ఇరువురు నేతలు పలు పాత ఘటనలను గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నాడు చేసిన ప్రజా పోరాటాలను గురించి చర్చించుకున్నారు. నాగం ఫైర్ బ్రాండ్‌గా ఉండేవారని....పార్టీ ఆదేశిస్తే దూసుకుపోయేవాళ్లని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఎంతో ఎమోషన్‌గా ఉండేవారంటూ నాటి ఘటనలను ప్రస్తావించారు. నాలుగవసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబును చూడడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని నాగం ఈ వ్యాఖ్యానించారు. రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండాలి...తెలుగు ప్రజలు అన్ని రంగాల్లో విజయాలు సాధించాలనేదే తన అభిమతమని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

# తెలంగాణ రైజింగ్‌కు మద్దతుగా నిలవండి...

- విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి



**ఢిల్లీ,మార్చి 13 (వార్తాప్రభ) :** రాబోయే 25 సంవత్సరాల్లో తెలంగాణను సమున్నతంగా నిలిపేందుకు తమ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా నిలవాలని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి గురువారం కలిశారు. ఈసందర్భంగా 2025 సంవత్సరంలో హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న అంతర్జాతీయ కార్యక్రమాలైన మిస్ వరల్డ్, గ్లోబల్ డీప్ టెక్ సదస్సు, భారత్ సమ్మిట్, యానిమేషన్ గేమింగ్, వీఎఫ్ఎక్స్‌తో పాటు వినోద పరిశ్రమలో తెలంగాణ బలాన్ని చాటే ఇండియా జాయ్ వివరాలను కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ఈ కార్యక్రమాల నిర్వహణ ద్వారా తెలంగాణ రైజింగ్‌ను ప్రోత్సహించేందుకు మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రి జైశంకర్‌ను సీఎం కోరారు. తెలంగాణ రైజింగ్‌ను విదేశాల్లో భారత్ కార్యక్రమాల్లోనూ ప్రచారం చేయాలని, దౌత్య, లాజిస్టిక్ సహాయంతో హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమాల విజయవంతానికి సహకరించాలని కేంద్ర మంత్రి జైశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఉందని, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమైన హైదరాబాద్‌లో చేపట్టే కార్యక్రమాలకు తమ మంత్రిత్వ శాఖ మద్దతుగా నిలుస్తుందని కేంద్ర మంత్రి జైశంకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు. కార్యక్రమంలో విదేశీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, నాగర్ కర్నూలు, భువనగిరి లోక్‌సభ సభ్యులు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

# ఆ ముగ్గురికి మరో ఆరునెలలు అజ్ఞాతమే..!



**విజయవాడ పశ్చిమ,మార్చి 13 (వార్తాప్రభ) :** జగన్ అరాచకానికి, వైసీపీ నిరంకుశత్వానికి కాదేది అనర్హం అన్నట్టుగా ప్రభుత్వ ఉద్యోగులు సైతం వైసీపీ ప్రభుత్వాన్ని నమ్మి నట్టేట మునిగారు. ఏపీలో సంచలనం రేపిన నటి జిత్వాని కేసులో ఆరోపణలు ఎదుర్కున్న ముగ్గురు ఐ.పి.ఎస్.లు కాంతిరాణా టాటా, సీతారామాంజనేయులు, విశాల్ గున్నా లపై మరో 6 నెలలు సస్పెన్షన్ వేటు పొడగింపుకు ఏపీ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. వైసీపీ నేతల రాజకీయ ప్రలోభాలకు లొంగి జిత్వాని కేసులో చట్టాన్ని అతిక్రమించి వ్యవహరించిన ఈ ముగ్గురు ఐ. పి.ఎస్. లు ఇప్పుడు మూల్యం చెల్లిస్తున్నారు. అయితే ప్రభుత్వ ఉన్నతాధికారులుగా, ప్రజా సేవకులుగా ఉంటూ ఒక పార్టీ కోసం, ఆ ప్రభుత్వ పెద్దల కోసం వీరు చేసిన అరాచకాలకు సస్పెన్షన్ తో సరిపెట్టడం ఏంటి, అరెస్టులు చెయ్యరా అంటూ కూటమి ప్రభుత్వం పై విమర్శలు కూడా పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. జిత్వానిని అనధికారికంగా ఢిల్లీ నుంచి ఏపీకి తరలించడం దగ్గర నుంచి ఆమెను, ఆమె కుటుంబాన్ని మానసికంగా, శారీరకంగా హింసించి, దాదాపు మూడు నెలల పాటు నిర్బంధించిన ఈ ముగ్గురు వారి ఐపీఎస్ పదవికి కళంకం తెచ్చారనే చెప్పాలి. జగన్ అండ చూసుకుని గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వానికి ఊడిగం చేసిన వారిలో కాంతిరాణా టాటా, సీతారామాంజనేయుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కుంటున్న ఈ ముగ్గురు ఐపీఎస్ లు నిబంధనలను ఉల్లగించారంటూ రివ్యూ కమిటీ ఇచ్చిన సిఫారస్ మేరకు సెప్టెంబర్ 25 వరకు వీరి సస్పెన్షన్ కొనసాగుతున్నట్లు ఏపీ ప్రభుత్వం ఒక ప్రకటన జారీ చేసింది. అయితే నాడు వైసీపీ ప్రభుత్వం కోసం తలవంచిన పాపానికి నేడు కూటమి ప్రభుత్వ చర్యలతో ఇప్పుడు తలెత్తలేని పరిస్థితిని ఎదుర్కుంటున్నారు ఈ ముగ్గురు ఐపీఎస్ లు. ఒక ప్రభుత్వాన్ని నమ్మి, ఒక నాయకుడి అడుగులకు మడుగులొత్తితే దాని ఫలితం ఎలా ఉంటుందో గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వైస్సార్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో జగన్ నిర్ణయాలతో బలైన ఐఏఎస్ శ్రీలక్ష్మి, మరికొంతమంది అధికారులను చూసిన తరువాత కూడా ఈ ముగ్గురు తమ పరిధి దాటి ముందుకెళ్లారు అంటే అది వారి బరి తెగింపనాలా.? లేక వ్యవస్థల పని తీరు మీద వారికున్న నిర్లక్ష్యమనాలా.?




## తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర వేసిన మొల్ల

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి,మార్చి 13 (వార్తాప్రభ) :** తెలుగు సాహిత్యంలో కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ(మొల్ల) చెరగని ముద్ర వేశారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. తెలుగు సాహిత్యంలో ఆమె రచనలకు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. గురువారం మొల్ల జయంతి సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో ఆమె చిత్రపటానికి మంత్రి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, సామాన్య కుమ్మరి కుటుంబంలో జన్మించిన మొల్లమాంబ శ్రీరాముడిని అచంచలమైన భక్తి ప్రపత్తులతో కొలిచారన్నారు. వాల్మీకి రామాయణాన్ని తెలుగులోకి అనువదించించిన మహానీయురాలు మొల్ల అని కొనియాడారు. తెలుగు వాడుక భాషలోకి ఆమె రచించిన రామాయణం మొల్ల రామాయణంగా ప్రఖ్యాతగాంచిందన్నారు. మొల్ల తన రచనలలో నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చేవారన్నారు. తెనాలి రామలింగడ వంటి దిగ్గజ కవులకు మొల్ల సమకాలీనరాలు అని చరిత్ర చెబుతోంది. కడపలోని గోపవరం గ్రామంలో జన్మించిన మొల్ల నేటి తరం మహిళాలకు, కవయిత్రిలకు ఆదర్శమని కొనియాడారు. ఆమె రచనలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మంత్రి సవిత స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ ను కలిసిన పిన్నెల్లికి చెందిన 400 కుటుంబాలు

- పిన్నెల్లిలో 400 వైసీపీ సానుభూతిపరుల కుటుంబాలపై గ్రామ బహిష్కరణ



**అమరావతి,మార్చి 13 (వార్తాప్రభ) :** వైసీపీ అధినేత జగన్ ను గురజాల నియోజకవర్గం మాచవరం మండలం పిన్నెల్లి గ్రామస్తులు కలిశారు. గ్రామంలోని 400 సానుభూతిపరుల కుటుంబాలపై గ్రామ బహిష్కరణ వేటు వేశారు. ఇదే అంశంపై వైసీపీ హైకోర్టులో పోరాడుతోంది. ఛలో పిన్నెల్లి కార్యక్రమానికి వైసీపీ సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా పిన్నెల్లి గ్రామం వైసీపీ సానుభూతిపరులతో జగన్ మాట్లాడుతూ... పూర్తి న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోకి వస్తే చంపేస్తామని కూటమి నేతలు బెదిరిస్తున్నారని జగన్ కు వారు చెప్పారు. మీ అందరికీ పార్టీ అండగా ఉంటుందని జగన్ అన్నారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్ ఆధ్వర్యంలో పిన్నెల్లి గ్రామస్తులు జగన్ ను కలిశారు. చెన్నాయపాలెం, మాదెనపాడు, తురకపాలెం గ్రామాలకు చెందిన మరికొందరు కూడా జగన్ ను కలిశారు.

# పెన్షన్ల తొలగింపుపై ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించాలి

● ఎమ్మెల్సీ డా॥ మొండితోక అరుణ్ కుమార్



**నందిగామ,మార్చి 13 (వార్తాప్రభ) :** గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి సమావేశాల్లో పెన్షన్ల తొలగింపు పై జరిగిన చర్చ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పాల్గొని పెన్షన్ల తొలగింపు పై తీవ్రమైన విమర్శలు చేశారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పెన్షన్ల వెరిఫికేషన్లో ఆరు అంశాలను పరిశీలిస్తే ప్రస్తుత ప్రభుత్వం 13 అంశాలను పరిగణలోకి తీసుకొని పైలట్ సర్వే చేస్తున్నారని తెలిపారు. సదరన్ వెరిఫికేషన్ స్లాట్ దొరకడానికే నెలరోజుల సమయం పడుతున్నప్పుడు 15 రోజుల్లోనే సదరన్ సర్టిఫికెట్ తీసుకురావాలని నిబంధనలు విధించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. డప్పు కళాకారుల పెన్షన్లను ఏ ప్రాతిపదికన తొలగించారో చెప్పాలని అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. చిరునామా మారితేనే పెన్షన్లు తొలగించడం అనేది దారుణమైన చర్యగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ల తొలగింపులో మానవీయ కోణంలో ఆలోచించాలని ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ శాసనమండలిలో ప్రభుత్వాన్ని కోరారు.

# పైప్ లైన్ మరమ్మత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి



**నందిగామ,మార్చి 13 (వార్తాప్రభ) :** రామన్నపేట నుండి నందిగామ మధ్యలో ఉన్న పైప్ లైన్ మరమ్మత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం కృష్ణకుమారి పురపాలక సంఘ కమీషనర్ ఈ వీ రమణ బాబుతో కలిసి రామన్నపేట నుండి నందిగామకు మంచినీరు సరఫరా చేయు ఫిల్టర్ బెడ్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ పట్టణ ప్రజలకు వేసవిలో త్రాగునీరు ఇబ్బంది కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని మునిసిపల్ సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్న వెంకటేశ్వరరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత: ప్రిన్సిపాల్ ఉషారాణి






**కాకినాడ,మార్చి 13 (వార్తాప్రభ) :** పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని ఎంఎస్ ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి. ఉషారాణి అన్నారు. గురువారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉషారాణి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతో కళాశాల ప్రాంగణం సుందరంగా ఉండటమే కాకుండా, ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు. దీనిలో భాగంగా కళాశాల ప్రాంగణంలో ఉన్న వివిధ రకాల చెత్తను,పిచ్చి మొక్కలను తొలగించి కళాశాల ప్రాంగణాన్ని విద్యార్థిని విద్యార్థులు పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినీ,విద్యార్థులను ఎంఎస్ ఎన్ చారిటీస్ సంస్థల చైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్,ఎంఎస్ ఎన్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, ఏసీ అండ్ ఈవో కె.విజయలక్ష్మి,కళాశాల ప్రిన్సిపాల్ జి.ఉషా రాణి , డాక్టర్ మానికి రెడ్డి హెల్త్ కేర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మానికి రెడ్డి సత్యనారాయణ తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ సుబ్బారావు,అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇన్కమ్ టాక్స్ ఆఫీసర్ గా రాయవరం వాసి




**మాచర్ల రూరల్, మార్చి 13 (వార్తాప్రభ) :** మండల పరిధిలోని రాయవరం గ్రామంలో ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్లో ఆఫీసర్ గా యాదవ సామాజిక వర్గానికి చెందిన వీరబోయిన శ్రీనివాసరావు కుమారుడు హర్ష, ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్లు ఉద్యోగం సాధించిన వీరబోయిన హర్షకు నియోజకవర్గ పరిధిలోని బీసీ సంఘాలు, అదేవిధంగా యాదవ సంఘం నేతలు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, పలువురు అభినందనలు తెలిపారు. మన మాచర్ల ప్రాంతంలో ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్లో ఉద్యోగం రావటం హర్షనీయమని అన్నారు. హర్ష లాగా అందరూ చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించాలని పలువురు కోరారు.

# నూతిపాడు ఆంధ్ర బోర్డర్ 101 రెగ్యులేటర్ క్షేత్ర స్థాయి పరిశీలన

● డీఎంసీ రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు

**విస్సన్నపేట,మార్చి 13 (వార్తాప్రభ) :** నాగార్జున సాగర్ ఎడమ కాలువ మూడవ జోన్ లో తీవ్ర సాగునీరు ఎద్దడి నెలకొన్న పరిస్థితులలో ఆయకట్టు లోని తిరువూరు, మైలవరం, నూజివీడు, నందిగామ, గన్నవరం నియోజకవర్గాలలో ఉన్న 2.36 లక్షల ఎకరాల పంట భూములను రక్షించేందుకు సహాయపడవలసిందిగా తెలంగాణ ప్రభుత్వాన్ని నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్, సాగునీటి వినియోగదారుల సంఘాల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణరావు తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయకట్టు సంబంధిత నియోజకవర్గాల శాసన సభ్యులు ఈ విషయాన్ని అసెంబ్లీ వేదికగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రివర్యులు నిమ్మల రామానాయుడు ద్వారా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్ళగా ఈ విషయాన్ని ఏపీ ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది అన్నారు . గురువారం ఉదయం ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం నూతిపాడు ఎడమ కాలువ 101 కిలోమీటర్ ఆంధ్ర ప్రదేశ్ బోర్డర్ లో నూతిపాడు వద్ద తెలంగాణ నుండి వస్తున్న నీటి వరవడిని యన్.టి.అర్. జిల్లాకు చెందిన తాళ్లూరి రవిశంకర్ (తిరువూరు), కటారి కోటేశ్వరరావు (కునపరాజ పర్వ), కొల్లి శ్రీనివాస రెడ్డి (రెడ్డి గూడెం), పామర్తి శ్రీనివాసరావు (నున్న), ఏలూరు జిల్లా చెందిన రా పర్ల బాలకృష్ణ (ముసునూరు), కృష్ణాజిల్లా కు చెందిన దేవినేని సత్యన్నారాయణ (మడిచెర్ల) తదితరులు సాగర్ జలాలను క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. ఆ సమయంలో కేవలం 234 క్యూసెక్కులు పైన ఉన్న తెలంగాణ ప్రభుత్వం క్రిందకు విడుదల చేయడాన్ని వారు గమనించారు. ఈ రెగ్యులేటర్ దగ్గర నుంచి ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ నాగార్జున సాగర్ ఎడమ కాలువకు 32 టి.ఎమ్.సి లు వాటా ఉన్నప్పటికీ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు నీటి ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ కేవలం 18 టి.ఎమ్.సి లు మాత్రమే పైన ఉన్న తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిందని మూడవ జోన్ లో ఆయకట్టును నమ్ముకొని ఎన్.టి.ఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల లోని తిరువూరు, నూజివీడు, గన్నవరం, మైలవరం, నందిగామ, దెందులూరు నియోజక వర్గాలలో 2.36 లక్షల ఎకరాల ఆయకట్టులో రైతులు ప్రత్తి, పొగాకు, జొన్న, మొక్కజొన్న, మామిడి తదితర ఆరుతడి పంటలకు సాగు చేశారని ఈ పంటలకు గత



రెండు నెలలుగా ఒక తడి కూడా ఇవ్వకపోవడం వలన ప్రస్తుతం ఎండిపోయే దశలో ఉన్నాయని గ్రామాలలో చెరువులలో కనీసం త్రాగు నీరు లేకపోవటం వలన భూగర్భ జలాలు కూడా రోజు రోజుకు అడుగంటి పోతున్నాయని ఈ తీవ్ర నీటి ఎద్దడి దృష్ట్యా నాగార్జున సాగర్ ఎడమ కాలువ పైనుంచి తెలంగాణా ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి కనీసం 2000 క్యూసెక్కులు ఏప్రిల్ 15 వ తారీకు వరకు ఆంధ్ర ప్రదేశ్ బోర్డర్ కు నిరంతరంగా విడుదల చేసి సాగు చేసిన ఆరుతడి పంటలను రక్షించాలని తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆనవాయితీ ప్రకారం పాలేరు రిజర్వాయర్ హెడ్ ను 20 అడుగులు కు పెంచి ఆంధ్ర ప్రదేశ్ కు మిగిలి ఉన్న 13 టి. ఎమ్. సి ల కోటా నుంచి 2000 క్యూసెక్కు లను విడుదల చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఉన్నత అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయకట్టులోని రైతు నాయకులు సగ్గుర్తి సుభాష్ చంద్రబోస్, తాళ్లూరి కిరణ్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు కవులూరి రాజా చంద్రమౌళి, వేమిరెడ్డి పల్లె టిడిపి నాయకులు పంతంగి రమేష్ ఎన్. ఎస్.పి. అసిస్టెంట్ ఇంజనీర్లు కె. మహేష్, పి. సునీత, ఎల్. బ్రహ్మం, కె. ప్రసన్న కుమార్, తెలంగాణ ఎన్. ఎస్.పి. అధికారులు శ్రీనివాసరెడ్డి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ కిడ్నీ మాస ఉత్సవ అవగాహన కార్యక్రమాలు - కిడ్నీ స్పెషలిస్ట్ అన్వేష్



**విస్సన్నపేట,మార్చి 13 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో జివిఆర్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో కిడ్నీ స్పెషలిస్ట్ డాక్టర్ అన్వేష్ ఆధ్వర్యంలో కిడ్నీ మాసోత్సవం అవగాహన కార్యక్రమాలలో భాగంగా అపోలో ల్యాబ్ ఆధ్వర్యంలో ఉచితంగా రక్త పరీక్షలను దార్ల వినోద్ నిర్వహించారు. షుగర్ వంశపారపర్యంగా ఉన్నవారు కిడ్నీ వ్యాధి ఎక్కువగా వచ్చే పరిస్థితి ఉంటుంది కాబట్టి కంపల్సరిగా రక్త పరీక్షలు చేయించుకోవాలని మూత్రపిండాల వ్యాధికి ప్రధానంగా ప్రమాద కారకాలు మధుమేహం హైపర్ టెన్షన్ కార్డియోవాస్కులర్ వ్యాధి ఉపకాయం తదితరాలు కారణమవుతాయన్నారు. మార్చి నెల ప్రపంచ కిడ్నీ మాసంగా గుర్తించడం జరిగిందని దేశవ్యాప్తంగా ఉన్న కిడ్నీ సంబంధిత డాక్టర్లు కిడ్నీ వ్యాధి గురించి అవగాహన పెంచడం జరుగుతుందని దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి అనేది దాదాపు 35 మిలియన్ల మందిని ప్రభావితం చేసి తీవ్రమైన పరిస్థితి లక్షణాలు కనిపించే వరకు సరస్సు నిర్లక్ష్యం చేయబడుతుందని సి కె డి క్రమంగా పెరుగుతుందని దాని వలన గుండెపోటు మరియు మూత్రపిండాల వైఫల్యం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు మానవాళినే ప్రమాదంలో పడవేస్తుందని ఆరోగ్యకరమైన జీవన శైలిని అవలంబించడం వలన సి కె డి ని మరియు దాని సమస్యలు ముందుకు సాగకుండా నిలుపుదల చేయవచ్చు అన్నారు. మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాట్లను అనుసరించవలసి ఉంటుందని డాక్టర్ గోళ్ళ అన్వేష్ చెప్పారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సంబంధించి సంబంధించిన వైద్యుడు తో సన్నిహితంగా ఉండాలని అది స్వయంగా లేదా కంప్యూటర్ ద్వారా టెలిఫోన్ ఉపయోగించిన ఆరోగ్య సమస్యల గురించి ఉన్న అనుమానాలు నివృత్తి చేసుకోవటానికి మరియు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి డాక్టర్ కు పేషెంట్ కు ఉన్న సంబంధం సహాయపడుతుందన్నారు. దయాబెటిస్ ఉన్నవారు రక్తపోటు లక్ష్యాలను చేరుకోవటానికి మరియు రక్తంలో గ్లూకోజ్ స్థాయిని క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవడానికి ఒక ప్రణాళికను రూపొందించడానికి మీ వైద్యుడు తో సంప్రదింపులు జరుపుతూ ఉండాలన్నారు. వైద్యులు సూచించిన విధంగా మందులు తీసుకోవాలని అదేవిధంగా పరీక్షలు కూడా అలసత్వం లేకుండా చేయించుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన బరువును లక్ష్యంగా ఉండే విధంగా అడుగులు వేయాలన్నారు. ఒత్తిడిని తగ్గించుకోవాలని శారీరక శ్రమను మీ జన చర్యలో భాగం చేసుకోవాలని నిద్రించడానికి సమయం కేటాయించాలని ధూమపానం వంటి చెడు అలవాట్లు మానివేయాలని ఆయన అవగాహన కల్పించారు. అవగాహన అంతరం ఎనిమిది వందల రూపాయలు విలువ కలిగిన రక్త పరీక్షలతో పాటు మందుల కిట్లు ఉచితంగా అందించారు.

# రోడ్డు భద్రత వారోత్సవాలు పోటీలలో విజేతలకు బహుమతులు అందజేత



**హనుమాన్ జంక్షన్,మార్చి 13 (వార్తాప్రభ) :** మోహన్ స్పిన్ టెక్స్ కంపెనీ రేమల్లె వారు రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా జిల్లా పరిషత్ హై స్కూల్లో రేమల్లె లో ఇటీవల వీధి పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులు విద్యార్థులకు నేడు బహుమతి ప్రధానోత్సవం చేశారు. చిత్రలేఖను పోటీలు ఇంటి వద్ద భద్రత, తెలుగు వ్యాసరచన అంశం గృహోపకరణాల వినియోగంలో భద్రత, ఆంగ్ల వ్యాసరచన అంశం రోడ్డు భద్రత అంశాలలో పోటీలు నిర్వహించారు గెలుపొంది న విద్యార్థులు తోమ్మంద్రు పూజిత, కాట్ర రేవంత్ నిమ్మకూరు చైతన్య, తెమ్మంద్రు నాగచైతన్యా, నిమ్మకూరు రాజబాబు, గూడూరు ప్రేమ్ కుమార్, గొల్లపల్లి ప్రవళిక, సొది మేళ్ల సుప్రియ, రావెళ్ల సుమ తదితరులు గెలుపొందారు. విజేతలను గ్రామ ప్రముఖులు తుమ్మల వీర రాఘవేంద్ర రావు, శిక్షణ అందించిన ఉపాధ్యాయులు వి వెంకటేశ్వర దేవి, నందిగం సువార్చాలా దేవి, దీవి పార్థసారదీ,లను ప్రధానోపాధ్యాయులు నన్నేపాముల లూథర్ పాల్ అభినందించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పరస రాజేష్, వెలమర్తి రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కవియిత్రి మొల్ల జయంతి వేడుకలు



**నందిగామ,మార్చి 13 (వార్తాప్రభ) :** రామాయణ మహా గ్రంథాన్ని రచించిన కవియిత్రి మొల్లబాంబ జయంతి కార్యక్రమాలను గురువారం స్థానిక సీతారామాంజనేయ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో మండల శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ కన్వీనర్,శాలివాహన సంఘం నాయకులు తొర్లికొండ సీతారామయ్య టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి కాసర్ల లక్ష్మీనారాయణ తో కలిసి మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామాయణ మహా గ్రంథాన్ని రచించిన కవయిత్రి మొల్లమాంబ ఎంతో పుణ్యం చేసుకున్నారని పేర్కొన్నారు. మొల్లమాంబ జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘ నాయకులు తొగటి నరేష్ కుమార్,తొర్లికొండ శ్రీనివాసరావు,కోరంపల్లి వీరబ్రహ్మం,బొమ్మన సురేష్,టి రాజారావు,కళ్యాణం మాధవి, బెజవాడ వెంకట్రావమ్మ, సిరివెళ్ల రామకృష్ణ,దివ్వెల వీరభద్రరావు,ఎస్ క్రాంతి కుమార్,తొర్లికొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణకు సన్నద్ధం కావాలి: జెసి నిషాంతి



**అమలాపురం,మార్చి 13 (వార్తాప్రభ) :** ప్రస్తుత రబీ సీజన్లో ధాన్యం సేకరణకు సర్వ సన్నద్ధం కావాలని జిల్లా జాయింట్ కలెక్టరు టి.నిషాంతి లైన్ డిపార్ట్మెంట్ అధికారులను ఆదేశించారు. అమరావతి నుండి రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ సౌరబ్ గౌర్, మేనేజింగ్ డైరెక్టర్ జిలానీలు వీడియో కాన్ఫరెన్స్ వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లతో నిర్వహించి రబీ సీజన్లో ధాన్యం సేకరణ,ప్రజా పంపిణీ వ్యవస్థ దీపం 2 పథకాలపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జాయింట్ కలెక్టరు లైన్ డిపార్ట్మెంట్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ రాబోయే రబీ సీజన్ లో ధాన్యం సేకరణ కొరకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రతి రైతుకు మేలు జరిగే విధంగా ఉండాలని ఆదేశించారు. సరైన మద్దతు ధర లభించేందుకు లైన్ డిపార్ట్మెంట్ అధికారులు అంకిత భావం జవాబుదారీతనంతో పని చేయాలని ఆమె సూచించారు. దేశానికి వెన్నెముక అయిన రైతు సంక్షేమమే పరమావధిగా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా ప్రతి అధికారి పాటుపడాలన్నారు. శాఖల వారీగా ధాన్యం సేకరణకు అవసరమైన మౌలిక సదుపాయాలు స్థితిగతులను శాఖల వారీగా సమీక్షించి ఇంకా అవసరమైన సౌకర్యాలపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎం బాల సరస్వతి,జిల్లా పౌర సరఫరాల అధికారి ఏ.ఉదయ భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, పౌర సరఫరాల సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ ఏడి కె.విశాలాక్షి,కార్మిక శాఖ సహాయ కమిషనర్ టి. నాగలక్ష్మి,జిల్లా సహకార అధికారి ఎస్. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు శాఖకు సీసీ కెమెరాల అందజేత



**కాకినాడ,మార్చి 13 (వార్తాప్రభ) :** ప్రముఖ పారిశ్రామికవేత్త నారాయణం మురళి రూ. 1,20,000 విలువ గల సీసీ కెమెరాలు కాకినాడ జిల్లా పోలీసు శాఖకు బహూకరించారు. కాకినాడ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో ఎస్పీ జి.బిందు మాధవ్ ను కలిసి సీసీ కెమెరాలు అందజేసారు. కాకినాడ రూరల్ సర్పవరం పోలీసు స్టేషన్ పరిధి సూర్యారావు పేటకు చెందిన ఎన్సీఎస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నారాయణం మురళి సీసీ కెమెరాలు,ఇతర సాంకేతిక పరికరములను ఎస్డీపివో కాకినాడ ఎఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్., సర్పవరం సిఐ బి. పెద్దిరాజు సమక్షంలో జిల్లా ఎస్పీకి అందించారు. వీటిలో సిసి కెమెరాలు-12,ఆప్టికల్ ఫైబర్ కేబుల్-2000 మీటర్లు, నెట్వర్కు స్విచ్స్-3,16 ఛానల్ నెట్వర్క్ వీడియో రికార్డర్ ( ఎన్ వీఆర్)- 1,4టిబి హార్డ్ డిస్క్-1 కలిగి ఉన్నాయి. వీటిని బహుకరించినందుకు ఎన్సీఎస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నారాయణం మురళిని ఎస్పీ జి.బిందు మాధవ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఐ సర్పవరం పెద్దిరాజు,ఎన్సీఎస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఈడీ ఎన్ . శిషిర్,హెచ్చర్ పిఎస్సెన్ మూర్తిలు వారితో పాటు ఉన్నారు.

# 12 వ పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేయాలి...

● పెండింగ్ లో ఉన్న బకాయిల చెల్లింపు పై సత్వర చర్యలు చేపట్టాలి..... ● డాక్టర్ డి. శ్రీను, రాష్ట్ర అధ్యక్షుడు డెమొక్రటిక్ పి.ఆర్.టి.యు,



**విజయవాడ,మార్చి 13 (వార్తాప్రభ) :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము వెంటనే 12 వ పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేయాలని మరియు పెండింగ్ లో ఉన్న వివిధ బకాయిల చెల్లింపుల పై సత్వర చర్యలు తీసుకోవాలని డెమొక్రటిక్ పిఆర్టియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి. శ్రీను ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. డెమోక్రటిక్ పి ఆర్ టి యు శాఖ ఆధ్వర్యం లో నిర్వహించబడిన సభ్యత్వ నమోదు కార్యక్రమమునకు ముఖ్య అతిథి గా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు డి శ్రీను మాట్లాడుతూ పీ.ఎఫ్, ఎ.పి.జి.ఎల్.ఐ మరియు సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపుల పై సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.. డెమోక్రాటిక్ పిఆర్టియు కృష్ణ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు. జీ.వీ.ఎస్ పెరుమాళ్ళు నున్న రాం బాబు మాట్లాడుతూ సీనియారిటీ జాబితాలో లోపాలు సవరించి నూతన జాబితా విడుదల చేయాలని హేతుబద్దీకరణ వలన నష్టపోయిన ఉపాధ్యాయులకు బదిలీ లలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. మండలం లోని వివిధ పాఠశాలలు సందర్శించి సమస్యల ను తెలుసుకున్నారు.. ఈ కార్యక్రమంలో డి.పి.ఆర్.టి.యు నాయకులు డి.సత్యనారాయణ. బి.విజయలక్ష్మి. సిహెచ్ సాయి బాబా నరసింహారావు.శుభకర్ తదితరులు పాల్గొన్నారు.

# కలంకారి కళాకారులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన హెచ్సిఎల్ ఫౌండేషన్ వాసవ్య మహిళా మండలి



**పెడన,మార్చి 13 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలో వాసవ్య మహిళా మండలి -అమ్మ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో హెచ్ సి ఎల్ ఫౌండేషన్ సహకారంతో పుణ్యవతి కలంకారి యూనిట్ దగ్గర కలంకారి కార్మికులకు సుమారు మూడు వందల మంది కళాకారులకు మరియు నిరుపేద కుటుంబాలకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేయడం జరిగింది. కలంకారి ని ప్రపంచం మొత్తం విస్తరింపచ్చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు వాసవ్య మహిళా మండలి వారు రామాంజనేయులు విజయ్, హెచ్సీఎల్ ఫౌండేషన్ నుండి శ్రీనివాసులు దీక్షిత వారితోపాటు గ్రామ సర్పంచ్ యక్కల మాధవి ఎంపీటీసీ సభ్యులు పేరిశెట్టి తేజవతి. పెడన ప్రముఖులు కలంకారి భీమలింగం వేణు మాజీ సర్పంచ్ కట్ట మునీశ్వరరావు మరియు గ్రామ ప్రముఖులు కలంకారి కళాకారులు చేనేత కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# చిట్టి పాలెం లో చండీ హెూమం..





**బందరు,మార్చి 13 (వార్తాప్రభ) :** బందరు మండలం చిట్టి పాలెం గ్రామంలో పార్వతీ సమేత అర్ధనారీశ్వర స్వామి దత్త పాదుకా మందిరంలో గురువారం నాడు చతుర్దశిని పురస్కరించుకొని లోక కళ్యాణార్థం చండీ హెూమం, రుద్ర హెూమం, మూల మహా మంత్ర హెూమం, ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేక ద్రవ్యములు మేదర బద్దలతో అల్లిన చాటలలో ఉంచి హెూమ గుండంలో వేయుట, మారేడు కాయలు సేకరించి హెూమంలో వేయుట, కూష్మాండము స్వచ్ఛమైన ఆవు నెయ్యి మొదలగు ద్రవ్యాలతో నిర్వహించారు. అశేష సంఖ్యలో భక్తులు విచ్చేశారు. లోకకల్యాణం కొరకు భక్తులు సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్రాభివృద్ధి జరగాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామని డా. చావలి. పవన్ వంశీ శ్రీ తెలిపారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించి భక్తితో ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# నూతన వైసీపీ అధ్యక్షునికి కాపు నాయకుల అభినందనలు



**విస్సన్నపేట,మార్చి 13 (వార్తాప్రభ) :** స్థానిక మండల వైసీపీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఓలేటి దుర్గారావుకు స్థానిక కాపు నాయకులు సుగంధాది పరిమళాలు వెదజల్లే పూలదండలు వేసి పట్టు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

# గోదావరిఖనిలో ఉచితంగా "ఛావా" చిత్రం ప్రదర్శన!!

● సినిమా స్ఫూర్తితో యువకుల్లో నూతన ఉత్సాహం, ధైర్య సాహసం ● ప్రతి ఒక్క హిందూ సోదరులు సినిమా చూడాల్సిందే ● రామగుండం బిజెపి నేత కందుల సంధ్యారాణి



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 13 (వార్తాప్రభ ప్రతినిధి)**గోదావరిఖని ఊర్వశి థియేటర్లో హిందూ హృదయ సామ్రాట్ చత్రపతి శివాజీ మహారాజ్ తనయుడు శంభాజి మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా నిర్మించిన ఛావా చిత్రాన్ని రామగుండం బిజెపి నేత కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో ఉచితంగా ప్రదర్శింప చేశారు. చిత్రాన్ని చూసిన అనంతరం కందుల సంధ్యారాణి మీడియాతో మాట్లాడుతూ..... సినిమా స్ఫూర్తితో యువకుల్లో నూతన ఉత్సాహం, ధైర్య సాహసం రెట్టింపు అవుతుందని అన్నారు. ప్రతి ఒక్క హిందూ సోదరులు సినిమా చూడాల్సిందే అని పిలుపునిచ్చారు.

# జర్నలిస్టు పల్లె రవిని పరామర్శించిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు



**కుత్బుల్లాపూర్ మార్చి 13 (వార్తాప్రభ)** : ప్రమాదవశాత్తు జారిపడిన ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమ జర్నలిస్టు నేత పల్లె రవికుమార్ ను పలువురు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు పరామర్శించారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, పిల్లి రాంచందర్ తదితరులు గురువారం ఎల్బీ నగర్ లోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు పల్లె రవిని పలకరించి ప్రమాదం జరిగిన పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. మూడు రోజుల క్రితం ఉన్నట్టుండి హఠాత్తుగా కళ్ళు తిరిగి కిందపడిపోవడంతో కుడికాలు మడమ వద్ద ఎముక విరిగిందని, వెంటనే శస్త్రచికిత్స చేయించుకున్నానని చెప్పారు. ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నానని,నెల రోజుల పాటు విశ్రాంతి అవసరమని డాక్టర్లు చెప్పారని అన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ మరియు పెన్నులు పంపిణీ చేసిన బిజెపి నాయకులు





**జవహర్ నగర్, మార్చి,13:(వార్తా ప్రభ)**భారతీయ జనతా పార్టీ యువ మోర్చా సీనియర్ నాయకులు శేషంక్ సింగ్ (రాహుల్) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ మరియు పెన్నులు పంపిణి చేయడం జరిగింది. ఈనెల మార్చి 21నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా గురువారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజినగర్ ఫైరింగ్ రేంజ్ వద్ద ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ మరియు పెన్నులు పంపిణి చేయడం జరిగింది.ఈ సందర్భంగాశేషంక్ సింగ్ (రాహుల్) విద్యార్థుల తో మాట్లాడుతూ పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను ఆవరోధించాలని సూచించారు.విద్యార్థులు జ్ఞాపక శక్తి పెంచుకోవడానికి మెడిటేషన్ మరియు యోగ చేయడం ఎంతో అవసరం అని తెలిపారు.పరీక్ష లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని వారి తల్లీ దండ్రుల పేరును మరియు చదువు చెప్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలోజవహర్ నగర్ కార్పొరేషన్ బిజెపి యువ మోర్చా సీనియర్ నాయకులు రామకృష్ణ నాయుడు, బీజేవైఎం సీనియర్ నాయకులు తులసిరామ్, జితేందర్ శర్మ, మరియు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ కళలు, సంస్కృతిల ఆశాజ్యోతి కల్వకుంట్ల కవిత!!

● ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన వీర వనిత ● జన్మదినం సందర్భంగా ప్రత్యేక రక్తదాన శిబిరం ● వేడుకలు నిర్వహించిన రామగుండం జాగృతి యువజన విభాగం



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 13 (వార్తాప్రభ ప్రతినిధి)**తెలంగాణ కళలు, సంస్కృతిని కాపాడిన ఆశాజ్యోతి కల్వకుంట్ల కవిత అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక హరి, టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి కొనియాడారు. ఈ మేరకు కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా గురువారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో టీబీజీకేఎస్ కార్యాలయంలో రామగుండం జాగృతి యువజన విభాగం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 25 యూనిట్లను సేకరించారు. అతిధులు మాట్లాడుతూ..... ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన వీర వనిత కల్వకుంట్ల కవిత అని ప్రశంసించారు. ఈ వేడుకలలో బొగ్గుల సాయి కృష్ణ, రమేష్, సదానందం, హరీష్, కిషన్, రవి, శశి కుమార్, శ్రీనివాస్, సాయికుమార్, ప్రతాప్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధి నిధుల మంజూరు

**ఎంపీ ఆర్ఆర్ఆర్ కు కృతజ్ఞతలు తెలిపిన చీకటి కార్తీక్**



**భద్రాద్రికొత్తగూడెం మార్చి 13 (వార్తాప్రభ)** కొత్తగూడెం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం కోసం 1కోటి 26లక్షల 50వేలు మంజూరైనట్లు యూత్ కాంగ్రెస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ తెలిపారు. సుజాతనగర్ మండలానికి 48లక్షలు, చుంచుపల్లి మండలానికి 29 లక్షలు, లక్ష్మీదేవిపల్లి మండలానికి 49లక్షల 50వేలు చొప్పున ఈ మేరకు నిధుల మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ నిధుల మంజూరు కోసం కృషి చేసిన ఎంపీ రామ సహాయం రాఘురాంరెడ్డి కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం నుండి ఓ ప్రకటన విడుదల చేస్తు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న సిమెంట్ రోడ్ల నిర్మాణం కోసం ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి సహకారంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల కింద 1కోటి 26లక్షల 50వేలు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్దే ధ్యేయంగా సిమెంటు రోడ్లు మంజూరు చేసిన ఎంపీ ఆర్ఆర్ఆర్ కు ప్రత్యేకమైన అభినందనలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

# కోట్లాది మంది తెలంగాణ ప్రజల గుండె చప్పుడు కేసీఆర్!!

● ఆమరణ నిరాహార దీక్షతో ప్రాణాలను ఫణంగా పెట్టిన పోరాటయోధుడు ● తొలి సీఎంపై కాంగ్రెస్ సీఎం అనుచిత వ్యాఖ్యలు సబబు కాదు ● 'స్ట్రెచర్.. మార్చురీ' అనే మాటలు సిగ్గుచేటు కాంగ్రెస్ నేతలు విజ్ఞతను కోల్పోయి మాట్లాడటం మానుకోవాలి ● బీఆర్ఎస్ స్టేట్ లీడర్ కౌశిక హరి



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 13 (వార్తాప్రభ ప్రతినిధి)**కోట్లాది మంది తెలంగాణ ప్రజల గుండె చప్పుడు కేసీఆర్ అని బీఆర్ఎస్ స్టేట్ లీడర్ కౌశిక హరి కొనియాడారు. ఈ మేరకు గురువారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేసీఆర్ పై చేసిన అనుచిత వాఖ్యలను ఖండిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కౌశిక హరి మాట్లాడుతూ...... ఆమరణ నిరాహార దీక్షతో ప్రాణాలను ఫణంగా పెట్టిన పోరాటయోధుడు వలన తెలంగాణ రాష్ట్రం సిద్ధించినదని, తద్వారా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇవ్వడంతో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడని, ఆ సంగతిని కూడా మరిచి విజ్ఞతను కోల్పోయి పది సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై 'స్ట్రెచర్.. మార్చురీ' అనే మాటలు సిగ్గుచేటు అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాక్షేత్రంలో కేసీఆర్ కి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనియెడల పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో వడ్డేపల్లి శంకర్, శశి కుమార్, కొమరయ్య, సతీష్, నిమ్మరాజుల రవి, కళ్యాణ్, రవీందర్ రెడ్డి, సురేందర్, గోపి, సురేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ మీడియా కమిటీని వెంటనే ఏర్పాటు చేయండి

**-అర్హులైన మీడియా ప్రతినిధులకు ఎంట్రీ పాస్ ఇవ్వాలి-అసెంబ్లి కార్యదర్శికి టీడబ్ల్యూజేఎఫ్ లేఖ**



**కుత్బుల్లాపూర్ మార్చి 13 (వార్తాప్రభ)** : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో కొత్త మీడియా కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య కోరారు. ఈ మేరకు ఆయన గురువారం అసెంబ్లీ కార్యదర్శికి లేఖ రాశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా అసెంబ్లీలో మీడియా కమిటీ మారలేదని, కొత్త కమిటీ వేయకపోవడం, పాత కమిటీ పని చేయకపోవడం వల్ల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చాలా మంది మీడియా ప్రతినిధులకు ఎంట్రీ పాస్ లు లభించడం లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మీడియా కమిటీ చేసిన సిఫారసు మేరకే పాత జాబితా ప్రకారం అసెంబ్లీ ఎంట్రీ పాస్ లు ఇస్తూ ఇతర మీడియాల ప్రతినిధులకు ఇవ్వడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా చాలా కమిటీలు మారలేదని,గత ప్రభుత్వంలో వేసిన పాత కమిటీలే నేటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. అసెంబ్లీ మీడియా కమిటీతో పాటు రాష్ట్ర, జిల్లాస్థాయి మీడియా అక్రెడిటేషన్ కమిటీలు కూడా మారలేదని అన్నారు. జీవోల సమీక్ష పేరుతో కొత్త కమిటీలు వేయకుండా, కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల వార్తలను కవరేజి చేయడానికి అర్హులైన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు అసెంబ్లీ పాస్‌లు మంజూరు చేయాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు.గత సంవత్సరం నుండి అసెంబ్లీలో మీడియా కమిటీ లేదని, పాత కమిటీ ఉంది కానీ అది అమలులో లేదని, ఈ ప్రభుత్వంలో ఏ కమిటీ లేదని, దీనివల్ల జర్నలిస్టులు అసెంబ్లీ పాస్‌లు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రాథమిక సమస్యలను పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని, దీని వల్ల జర్నలిస్టులు ఇబ్బందులు పడడమే కాకుండా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని అన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అసెంబ్లీ సమావేశాలు రెండు సార్లు జరిగాయని, ప్రస్తుతం మూడోసారి బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా వెంటనే అసెంబ్లీ మీడియా కమిటీ ఏర్పాటు చేయాలని, లేదా అర్హత ఉన్న అన్ని మీడియా సంస్థల ప్రతినిధులకు అసెంబ్లీ ఎంట్రీ పాస్ లు మంజూరు చేయాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు.

# వరల్డ్ బ్యాంక్ ఫెలోషిప్ కు ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్ ఎంపిక

**కృష్ణ భాస్కర్ కు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అభినందనలు**
**భారతదేశం నుంచి ఎంపికైన ఏకైక అధికారి కృష్ణ భాస్కర్**



**హైదరాబాద్, మార్చి 13 (వార్తాప్రభ)** వరల్డ్ బ్యాంక్ ఫెలోషిప్ కు తెలంగాణ ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్ ఎంపిక అయ్యారు. స్టాటిస్టిక్స్ మరియు అనాలిటిక్స్ సంబంధించిన అంశంపై గత సంవత్సరం నుంచి ప్రపంచ బ్యాంకు ఫెలోషిప్ కోర్సు నిర్వహిస్తుంది. మాస్టర్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ లో చదువుకొని అందులో చేసిన ప్రాజెక్టు వర్క్ ప్రధాన ఆధారంగా ఈ ఫెలోషిప్ కు ఎంపిక చేశారు. ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఫెలోషిప్ కోసం 2600 పైచిలుకు దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ప్రపంచ వ్యాప్తంగా 33 మంది ప్రభుత్వంలో పని చేసిన అధికారులను ఎంపికగా చేశారు. కాగా భారతదేశం నుంచి ఎంపికైన ఏకైక అధికారి కృష్ణ భాస్కర్ కావడం గమనార్హం. ఫెలోషిప్ లో భాగంగా వాషింగ్టన్ డీసీలో తొమ్మిది రోజుల పాటు నేరుగా ట్రైనింగ్ పొందేందుకు రావాలంటూ వరల్డ్ బ్యాంక్ అధికారులు కృష్ణ భాస్కర్ కు ఆహ్వానం పంపారు. ఆరు నెలల కోర్సులో భాగంగా ప్రత్యేక శిక్షణ తదుపరి డిజిటల్ అనుబంధంగా ఈ కోర్సు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఫెలోషిప్ కు ఎంపికైన కృష్ణ భాస్కర్ అమెరికా వెళ్లడానికి ప్రభుత్వం అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కోర్సు కు సంబంధించిన వ్యయం మొత్తం వ్యయం మొత్తం వరల్డ్ బ్యాంక్ భరిస్తుంది. స్టాటిస్టిక్స్ మరియు అనాలటిక్స్ సంబంధించి అనుబంధాన్ని గుర్తించి ప్రపంచవ్యాప్తంగా ఈ రంగంలో ప్రభుత్వ అధికారులను ప్రోత్సహించాలనేది వరల్డ్ బ్యాంక్ ఆలోచన. ఈనెల 18 నుంచి 27 వరకు అమెరికాలో ప్రత్యక్ష కోర్సు జరుగనుంది.

**కృష్ణ భాస్కర్ కు ఉపముఖ్యమంత్రి అభినందనలు** ప్రతిష్టాత్మకమైన వరల్డ్ బ్యాంక్ ఫెలోషిప్ కు ఎంపికైన తన స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్ ను గురువారం అసెంబ్లీ ఆవరణలో అభినందించారు. భారతదేశ వ్యాప్తంగా ఒకే ఒకరు ఎంపిక కావడం అది మన రాష్ట్రానికి చెందిన ట్రాన్స్కో సీఎండి కావడం పై హర్షం వ్యక్తం చేశారు

# హైదరాబాద్

# ఘనంగా షిరిడి సాయి 29వ వార్షిక ఉత్సవాలు!!

● అంగరంగ వైభవంగా యాగ మహోత్సవం ● అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దైవ సేవలో తరించండి ● ఆలయ కమిటీ చైర్మన్ కన్నూరి సతీష్ కుమార్



**పెద్దపల్లి/ రామగుండం: మార్చి 13 (వార్తాప్రభ ప్రతినిధి)**ఘనంగా షిరిడి సాయి 29వ వార్షిక ఉత్సవాలు ఈనెల 15, 16వ తేదీలలో నిర్వహించనున్నట్లు అందుకు ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు రామగుండం షిరిడి సాయిబాబా మందిరం కమిటీ చైర్మన్ కన్నూరి సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అంగరంగ వైభవంగా యాగ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 15వ తేదీ శనివారం రోజున దేవతా స్థాపనములు, 16వ తేదీ ఆదివారం రోజున 108 మంది దంపతులచే శ్రీ శివ సుబ్రహ్మణ్య స్వామి మహాయాగం, విశిష్ట పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దైవ సేవలో తరించండి అని భక్తులను కోరారు.

## నూతనంగా సీసీ రోడ్డు నిర్మించినందుకు కృతజ్ఞతలు తెలిపిన జై శ్రీరామ్ నగర్ బస్తీ వాసులు



**కుత్బుల్లాపూర్ మార్చి 13 (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలని బస్టాండ్ చౌరస్తా నుండి దయానందనగర్ వెళ్లే మార్గంలో నూతనంగా సిసి రోడ్డు వేసినందుకు ఎమ్మెల్యే కె.పి వివేకానందకు, స్థానిక కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డికి, సంబంధిత అధికారులకు బస్తీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గత 4 సంవత్సరాలు నుండి ఈ రోడ్డు వేయడానికి కొంతమంది అడ్డంకులు సృష్టించారని. ఎట్టకేలకు నాయకుల చొరవతో... అధికారుల సహకారంతో సిసి రోడ్డును ఏర్పాటు చేసుకోవడం జరిగిందని జైశ్రీరామ్ నగర్, దయానందనగర్, పాండుబస్తీ, సంతోష్ నగర్, రావుల స్వామి నగర్ తదితర బస్తీ వాసులు హర్షం వ్యక్తంచేశారు. రోడ్డు ఏర్పాటు విషయంలో స్థానికులందరూ ఐకమత్యంగా ఉండి సీసీ రోడ్డును ఏవిధంగా ఐతే సాధించుకున్నామో... అదేవిధంగా అందరూ ఐకమత్యంగా ఉంటూ అండర్ గ్రౌండ్ సమస్య ను కూడా పరిష్కరించుకోవాలని బస్తీ నాయకులు ఆశాభావం వ్యక్తంచేశారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలి

**ఎస్ఎఫ్ఐ తొర్రూరు మండల అధ్యక్షుడు కళ్యాణి ఆకాష్**



**తొర్రూర్ మార్చి 13(వార్తా ప్రభ)**రాబోయే తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ తోర్రూర్ మండల అధ్యక్షుడు కళ్యాణి ఆకాష్ డిమాండ్ చేశారు. గురువారంఈ సందర్భంగా తొర్రూర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు.. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు.. 8600 కోట్ల పెండింగ్ స్కాలర్షిప్లు విడుదల కాకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆయన తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం లాగే విద్యారంగ సమస్యల మీద నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాలేజీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.. తెలంగాణ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ తొర్రూర్ మండల నాయకులు మహేష్, గణేష్, అనూష్, సతీష్ పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## స్టాలిన్ టీం లో జగన్ ?

ఏపీ మాజీ సీఎం వైసీపీ అధినేత జగన్ ను దేశంలోని ఇండియా కూటమి పక్షాలు తమతో కలుపుకోవాలని చూస్తున్నాయి. ఎందుకంటే ఆయన ఎన్డీయే అయితే బయటకు తెలిసి లేరు. ఇక ఏపీలో చూస్తే ఎన్డీయేతో దోస్తీ పరోక్షంగా చేయాలని చూసినా పరిస్థితులు అయితే అనుకూలించేలా లేవు.ఇంకా విడమరచి చెప్పుకోవాలంటే 2014 నుంచి 2019 మధ్య జగన్ అవసరం బీజేపీకి ఉండేది. ఏపీలో బాబుకు యాంటీగా మరో పార్టీని ప్రోత్సహించడం ద్వారా ఆయనను తన నియంత్రణలో ఉంచుకునే వ్యూహంలో భాగంగానే జగన్ ని చేరదీశారు తప్ప అందులో బీజేపీకి ప్రత్యేకించి జగన్ మీద వైసీపీ మీద వేరే ప్రత్యేక అభిమానాలు లేవు అన్నది ఒక విశ్లేషణగా చెబుతారు.ఇక 2019 నాటికి బాబు ఎటూ ఎదురుతిరిగి ఎన్డీయే కూటమి నుంచి వెళ్ళిపోయారు, పైగా ఓటమి పాలు అయ్యారు. దాంతో 22 ఎంపీ సీట్లు ఉన్న జగన్ బీజేపీకి మరింత రాజకీయ అవసరం అయ్యారనుకోవాలి. ఇక 2024 నాటికి చూస్తే ఏపీలో మూడు పార్టీలు కలసి కూటమిని కట్టాయి. అందులో జనసేనతో బీజేపీకి మంచి బంధమే ఉంది. బాబు కాదంటే జనసేనతో ముందుకు సాగాలన్న వ్యూహం కూడా ఉంది.అంటే ఏపీలో పవన్ ఉన్నంతవరకూ జగన్ అవసరం అన్నది బీజేపీకి పడదు అని భావించాలి. పైగా పవన్ సినీ నటుడు, బలమైన సామాజిక నేపథ్యం ఉన్న వారు. బీజేపీ పట్ల విధేయత ఉంది. ఆయన కూడా హిందూత్వను అనుసరిస్తున్నారు. ఇలా ఎన్నో భావసారూప్యాలు కలగలసిన పవన్ తోనే బీజేపీ ప్రయాణం చేస్తుంది, ఏపీలో తన రాజకీయ గమ్యస్థానం చేరుకునేందుకు పవన్ తోనే బలమైన స్నేహ బంధాన్ని కొనసాగిస్తుంది అని అంటున్నారు.ఇక జగన్ అవసరం బీజేపీకి లేదా అంటే బయట ప్రత్యర్ధిగా ఆ పార్టీ ఉంది. బాబుకు వైసీపీ ఢీ కొట్టే పరిస్థితి వస్తే అపుడు బీజేపీ కూడా ఈ వైపు చూసే చాన్స్ ఉంటుంది. అంతవరకూ మాత్రం వైసీపీతో ఎలాంటి బంధాలు ఉండవనే అనుకోవాలని అంటున్నారు.ఈ క్రమంలో దేశంలో ఉన్న రెండు బలమైన రాజకీయ శిబిరాలలో తాను ఏ వైపు అన్నది జగన్ మాత్రమే తేల్చుకోవాలని అంటున్నారు. దేశంలో ఎండీయేను వ్యతిరేకించే శక్తులన్నీ కలసి ఇండియా కూటమిగా కట్టాయి. అయితే జగన్ కాంగ్రెస్ ని కూడా ఎంతగానో వ్యతిరేకిస్తారు కాబట్టి ఆ కూటమి వైపు చూడడం లేదు అన్న చర్చ ఒకటి ఉంది.అయితే ఇపుడు దక్షిణ భారతాన ఇండియా మిత్రులను సమీకరించే పనిలో తమిళనాడు సీఎం స్టాలిన్ చేస్తున్నారు. దానికి రాజకీయ కారణాల కంటే సౌత్ స్టేట్స్ అస్తిత్వం అన్న కీలకమైన విషయం ఉంది. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే కచ్చితంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి.ఆ విధంగా చూస్తే ఏపీకి మూడు ఎంపీ సీట్లు మాత్రమే పెరుగుతాయి. తమిళనాడులో రెండు మాత్రమే పెరుగుతాయి. తెలంగాణాలో కూడా రెండో మూడో అదనం అవుతాయి. కేరళ విషయం అయితే ఉన్నవి తగ్గిపోతాయని అంటున్నారు. కర్ణాటక మాత్రం కొన్ని సీట్లు మిగిలిన వాటి కంటే పెంచుకుంటుంది అన్నది ఒక అంచనా ఉంది.ఈ క్రమంలో దక్షిణాది రాష్ట్రాలు అన్నీ ఐక్యంగా ఉండి కేంద్రంలోని బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అమలు చేయబోతున్న డీలిమిటేషన్ ని వ్యతిరేకించాలని స్టాలిన్ గట్టిగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన దక్షిణాది రాష్ట్రాల ఎండీయేతర రాజకీయ పార్టీల అధినేతలను ముఖ్యమంత్రులను పిలుస్తున్నారు.ఈ నెల 22న చెన్నైలో జరితే దక్షిణ భారత అఖిలపక్ష నేతల సమావేశానికి హాజరు కావాలని జగన్ ని కోరుతూ తన మంత్రిని కూడా పంపించారు. ఈ మేరకు తాడేపల్లిలోని జగన్ కార్యాలయంలో తమిళనాడు మంత్రి ఈవీ వేలు, ఎంపీ విల్సన్ భేటీ అయి ఈ సమావేశం గురించి వివరించారు. అంతే కాదు జగన్ ని తప్పనిసరిగా హాజరు కావాలని స్టాలిన్ తరఫున ఆహ్వానించారు.అంతే కాదు స్టాలిన్ జగన్ కి రాసిన లేఖను కూడా ఆయనకు అందచేశారు. దీంతో వైసీపీ విషయంలో ఇది కీలకమైన విషయంగా మారుతోంది. ఈ మీటింగ్ కి జగన్ హాజరైనా హాజరు కాకపోయినా అది రాజకీయంగా సంచలనమే అవుతుంది అని అంటున్నారు. ఆయన హాజరైతే ఇండియా కూటమికి దగ్గర అవుతున్నారు అని వార్తలు వస్తాయి. హాజరు కాకపోతే ఇంకా బీజేపీ వైపే ఉన్నారని కూడా విమర్శలు వస్తాయి. మొత్తానికి వైసీపీ ఈ విషయంలో తేల్చుకోవాల్సి ఉంది. జాతీయ రాజకీయాల్లో ఇపుడు అన్ని పార్టీలు ఒక స్టాండ్ తీసుకున్నాయి. వైసీపీ న్యూట్రల్ స్టాండ్ తో ఉంది.కానీ దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని మీటింగ్ పెడితే దానికి కూడా దూరంగా ఉంటే వైసీపీ మీద విమర్శలు కూడా వస్తాయని అంటున్నారు. చూడాలి మరి జగన్ స్టాలిన్ టీం లోకి వస్తారా లేదా అన్నది తొందరలో తేలనుంది అంటున్నారు.

## మేలైన వ్యవసాయ సాగు పద్ధతుల పొలంబడి పొలాల పరిశీలన



**చేజర్ల మార్చి 13 (వార్తాప్రభ)** మండలంలోని మడపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న జిఏపి పొలంబడి కార్యక్రమాన్ని ఏపీఎస్ఓ పిసిఏ ఎక్స్టర్నల్ ఫీల్డ్ ఇన్స్ట్రక్టర్ వెంకట సునీల్ కుమార్ రెడ్డి తో కలిసి పొదలకూరు ఏడిఏ శివ నాయక్ అలాగే చేజర్ల మండల వ్యవసాయ అధికారి శశిధర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండపల్లిలోని జిఏపీ పొలంబడి పద్ధతులను పాటించుచున్న రైతుల పొలాలను పరిశీలించడం జరిగినది.రైతులు వాడుతున్న ఎరువులు పురుగుమందులు వాటి మోతాదు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.రైతులు నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పంట కోసిన తర్వాత ధాన్యం శాంపుల్ ని సేకరించి పంపించమన్నారు.ల్యాబ్ లో పురుగు మందులు అవశేషాల పరిమితికి లోబడి ఉన్నాయని నిర్ధారించిన పిదప ఆయా రైతులకు స్కోప్ సర్టిఫికేట్ మంజూరు చేసి రైతులకు ఎఫ్ పిఓ ద్వారా మంచి ధర లభించే అవకాశం ఉన్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ పిఓ సిసి గోపాల్ విఏఏ మమత రైతులు పాల్గొన్నారు.

## బకాయిలను వెంటనే రికవరీ చేయండి

**అనంతపురం మార్చి 13 (వార్తాప్రభ)** కలెక్టర్ కార్యాలయంలో సత్యసాయి నీటి సరఫరా బోర్డు సమావేశంలో అనంతపురం జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ గురువారం పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ. జిల్లాలో పలు మునిసిపాలిటీలు చెల్లించాల్సిన వాటర్ యూజర్ చార్జీలను వెంటనే చెల్లించేలాగా.. అదేవిధంగా సమయానుసారం ఫిల్టర్లను శుభ్రపరచి, పైప్ లీకేజీ, డ్యామేజీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

# ముగిసిన పోషణ్ భీ పఢాయి బీ శిక్షణ తరగతులు





**చేజర్ల మార్చి 13 (వార్తాప్రభ)** మండలంలోని ఆదూరుపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్ నందు ఈ నెల 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు మూడు రోజులపాటు పోషన్ భీ పఢాయి బీ కార్యక్రమాన్ని చేజర్ల ఐసిడిఎస్ సూపర్వైజర్స్ వారి అంగన్వాడీ కార్యకర్తలతో శిక్షణ తరగతులను నిర్వహించారు.మూడవ రోజు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిచేయడం జరిగినదని సూపర్వైజర్లు తెలిపారు. మూడవరోజు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఐసిడిఎస్ ఆత్మకూరు ప్రాజెక్టు సిడిపిఓ పి.సునీలత హాజరవడం జరిగినది.అలాగే చేజర్ల ఐఈఆర్టీ ఉపాధ్యాయులు ఎస్కే మస్తాన్వలి పాల్గొని ఈ శిక్షణ కార్యక్రమంలో 21 రకాల డీజిబిత్ టీస్ గురించి వివరించడం జరిగింది.అలాగే సిడిపిఓ సునీలత మాట్లాడుతూ మూడు రోజుల్లో జరిగిన శిక్షణలోని అన్నీ అంశాలను అంగన్వాడీ పరిధిలో 100 శాతం అమలు చేయాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూపర్వైజర్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది.ఐసిడిఎస్ సూపర్వైజర్స్ సిహెచ్ సురేఖ ఆర్ రమాదేవి సిడిపిఓ ఆదేశాలతో అంగన్వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేయడం జరిగింది.

# అలంకారప్రాయంగా మారిన ఎస్ బి ఐ ఏటిఎమ్ ను రిపేరు చేయండి

## స్థానిక సి పి ఐ నాయకుల విజ్ఞప్తి





**విజయవాడ పశ్చిమ మార్చి 13 వార్తా ప్రభ ప్రతినిధి**ఎన్నోరోజుగా అలంకార ప్రాయంగా మారిన చిట్టినగర్ కుండల మార్కెట్ సెంటర్ లోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎస్ బి ఐఏటీమ్ ని రిపేరు చేయించాలని స్థానిక సి పి ఐ నాయకులు బ్యాంకు ఉన్నత అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని నేడు చాలామంది విలువైన సమయాన్ని వృథా చేయకుండా దైనందిన జీవితంలో ఏ టి ఎమ్ ని వినియోగించుకొం టున్నారు. అలాంటి చౌకర్యాలను ప్రజలకు అలవాటు చేసిన బ్యాంకు అధికారులు ఏటీమ్ లు 24 గంటలు అందుబాటులో ఉండేలా చేశారు. అంతా భాగానే వుంది కానీ సాంకేతిక అంతరాయం ఏర్పడిన వెంటనే ఏటీమ్ లను రిపేరు చేయడంలో అశ్రద్ధ వహించడం సరైనది కాదని నగర సీపీఐ కార్యవర్గ సభ్యులు, మాజీ కార్పొరేటర్,సీపీఐ 47,48,డివిజన్ల ఇంచార్జి డి వి రమణ బాబు,48 వ, డివిజన్ సీపీఐ కార్యదర్శి కే వెంకటేశ్వరరావు స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏటీమ్ పనిచేయక పోవడంతో అది ఆకతాయిలు తమ అడ్డాగా మర్చికొని ఆగడాలకు పాల్పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తంచేశారు.

# రంజాన్ తోఫా కిట్లు ఇంటింటికి తిరుగుతూ అందజేత

## రంజాన్ కిట్లను పంపిణీ చేసిన షేక్ గయాసుద్దీన్ (ఐజా)





**విజయవాడ పశ్చిమ మార్చి 13: వార్తా ప్రభ ప్రతినిధి**రంజాన్ పండుగను పురస్కరించుకుని ప్రార్థనలు చేసే ముస్లిం సోదరులకు అవసరమైన కిట్లను ఐజా గ్రూప్ చైర్మన్ షేక్ గయాసుద్దీన్ (ఐజా) గురువారం సాయంత్రం భవానిపురంలో ముస్లిం సోదరులకు అందజేశారు. భవానిపురం ప్రాంతంలోని ఇంటింటికి తిరుగుతూ ఆయన ఈ కిట్లను ముస్లిం సోదరులకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా గయాసుద్దీన్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ప్రార్థనలు చేసే ముస్లిం సోదరులకు ఉపయుక్తంగా ఉండేలా ఈ కిట్లను అందజేయడం జరిగిందని అన్నారు. ప్రతి ఏటా రంజాన్ సందర్భంగా తాము రంజాన్ తోఫాను అందిస్తూ వచ్చినట్లు ఆయన వివరించారు.ఐతే ఈ సారిమాత్రం తానే స్వయంగా ఇంటింటికి తిరిగి అందించడం తనకు ఎంతో ఆత్మతృప్తిగా వుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి తిరుపతి అనూష విరాళం

- లక్ష రూపాయల చెక్కును మంత్రి నాదెండ్ల మనోహర్ కు అందజేత
- విరాళం అందజేయటం సంతోషంగా ఉంది
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు అందరం కృషి చేద్దాం
- జనసేన పార్టీ అభివృద్ధికి తోడ్పాటు అందిద్దాం
- జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష



**విజయవాడ పశ్చిమ మార్చి 13వార్తా ప్రభ ప్రతినిధి**జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష పార్టీకి గురువారం లక్ష రూపాయలు విరాళంగా మంత్రి నాదెండ్ల మనోహర్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి తన వంతుగా ఈ ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం ప్రతి జనసైనికుడికి గర్వించదగిన రోజు అని, ప్రజల సంక్షేమం కోసం పోరాడుతున్న పార్టీకి తన వంతు సహాయం అందించడం గర్వంగా అనిపిస్తుందని పేర్కొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తూ, పార్టీని మరింత బలంగా తీర్చిదిద్దాలని ఆమె ఆకాంక్షించారు. జనసేన పార్టీకి మద్దతుగా ముందుకు వచ్చి విరాళాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# ఫార్మా రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర పై అవగాహన సదస్సు



**ఇబ్రహీంపట్నం, మార్చి 13(వార్తా ప్రభ ప్రతినిధి):**స్థానిక నిమ్రా ఫార్మసీ కళాశాలలో ట్రెయినింగ్ మరియు ప్లేస్మెంట్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఫార్మా రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ యొక్క ప్రాముఖ్యత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. శనివారం నాడు కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సదస్సులో అవగాహన సదస్సులో టెక్ మైండ్ స్పార్ స్పార్క్ ఛీఫ్ ఎక్సిక్యూటివ్ ఆఫీసర్ మరియు కో ఫౌండర్ సుంకర దిలీప్ ముఖ్య వక్తగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాల జీ అభివృద్ధి వల్ల ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటర్రైజెన్స్ మరియు మెడికల్ కోడింగ్ ఈ రంగంలో మార్పులు తీసుకొచ్చారని తెలిపారు.టెక్ మైండ్ స్పార్క్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మేఘన మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ శిక్షణ చాలా అవసరమైనదని, ఇది వారి విధుల్లో మెరుగైన నైపుణ్యాలు, ఖచ్చితత్వం మరియు నూతన మార్గాలను తీసుకొచ్చే అవకాశాన్ని ఇస్తుంది అని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా యమ్. జనార్ధన్ మాట్లాడుతూ ఔషదాల పరిశోధన మరియు అభివృద్ధి, క్లినికల్ ట్రయల్స్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క పాత్ర, ఔషదాల పరస్పర చర్యలను అన్వేషించడంలో, రోగి డేటా విశ్లేషణలో ప్రాముఖ్యత తెలిపారు.ఈ కార్యక్రమంలో మురళీ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థిని,విధ్యార్థులు పాల్గొన్నారు.

# రెడ్డిగూడెంలో ముఖ్యమంత్రి సహాయానిది చెక్కులు పంపిణీ,

## సేవే లక్ష్యం - ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం!-ఎం ఎన్ ఆర్



**రెడ్డిగూడెం మార్చి 13 (వార్తాప్రభ)** :మైలవరం శాసనసభ్యులు శ్రీ వసంత వెంకట కృష్ణ ప్రసాద్ లేఖ ద్వారా మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు లబ్ధిదారులకు ఈ రోజు అందజేయడం జరిగింది.ఈ చెక్కులను రెడ్డిగూడెం టీడీపి మండల పార్టీ అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి అర్హులైన కుమ్మరి పెద్ద నరసింహారావు , బత్తుల విజయలక్ష్మికు చెక్కులను అందజేశారు.ఈ ఆర్థిక సహాయాన్ని అందుకున్న లబ్ధిదారులు శాసనసభ్యులు కృష్ణ ప్రసాద్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ జనహితం కోసం నిరంతరం కృషి – ప్రజాసేవే పరమావధి! అన్నారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు పైడమర్ల కిరణ్ కుమార్ రెడ్డి,మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రుద్రవరం గ్రామం లో సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం,



**రెడ్డిగూడెం మార్చి 13 (వార్తాప్రభ)** :మైలవరం శాసనసభ్యులు శ్రీ వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సహకారంతో మంజూరు అయిన సిమెంట్ రోడ్ల పనులు రెడ్డిగూడెం మండలం రుద్రవరం గ్రామ లో ఈరోజు ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమంలో ముప్పిడి నాగేశ్వరరెడ్డి కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న శాసనసభ్యులకు గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఇది నూతన మార్గానికి నాంది%ఌ% అభివృద్ధే మా శాసనసభ్యుల లక్ష్యం! అని అన్నారు.

# రంగులు జీవితాన్ని ప్రభావితం చేస్తాయి

## శ్రీ గాయత్రి స్కూల్లో ఘనంగా ముందస్తు హెూలీ పండుగ.



**పొదలకూరు మార్చి 13 (వార్తాప్రభ)** రంగులు మన జీవితాన్ని ప్రభావితం చేస్తాయని శ్రీ గాయత్రి స్కూల్ కరస్పాండెంట్ చైతన్య కుమార్ రెడ్డి అన్నారు. గురువారం తమ స్కూల్లో ముందస్తు హెూలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించామన్నారు.స్కూల్ ఆవరణమంతా రంగురంగుల రంగవల్లికలతో నింపారు. చిన్నారులు కేరింతలు కొడుతూ ఒకరికొకరు రంగులు పూసుకున్నారు. ఉపాధ్యాయులు సైతం పిల్లలతో మమేకమ య్యారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చైతన్య కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ స్కూల్లో ప్రతి డే-అండ్-ఈవెంట్స్ ను కచ్చితంగా నిర్వహిస్తామ న్నారు.దాంతో పాటు ఆ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరిస్తామ న్నారు.తద్వారా చదువుతో పాటు కల్చరల్ యాక్టివిటీస్ లో సైతం తమ విద్యార్థులు చురుకుగా వుంటారన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రబాబు ఏడుకొండలు బాబు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మానవ జాతి కి నిద్ర దేవుడిచ్చిన వరం

● ఆధునిక పోకడలతో ఆ వరాన్ని దూరంగా చేస్తున్నాం ● మనిషికి ఆకలి, దాహం ,శ్వాస, ఎంత ముఖ్యమో నిద్రకూడా అంతే ముఖ్యం ● మమత చిల్డ్రన్స్ హాస్పిటల్ అధినేత్రి డాక్టర్ వి శ్రీదేవి ● నేడు ప్రపంచ నిద్ర దినం సందర్భంగా వార్తా ప్రభ దినపత్రిక ప్రత్యేక కథనం

**యేమినేని వెంకట రమణ**

**విజయవాడ పశ్చిమ మార్చి 13 వార్తా ప్రభ ప్రతినిధి** నిద్ర అనేది మనుషులకు,పశు పక్ష్యాదులకు దేవుడు ఇచ్చిన వరమని అలాంటి వరాన్ని మానవులు తప్ప మిగతా జీవరాసులు సక్రమంగా వినియోగించుకొంటున్నాయని నిద్ర కరువైన మనుషుల జీవన సమతుల్యత దెబ్బతింటుందని మమత చిల్డ్రన్స్ హాస్పిటల్ అధినేత్రి డాక్టర్ వి శ్రీదేవి అన్నారు. ప్రపంచ నిద్ర దినం సందర్భంగా వార్తా ప్రభ దినపత్రిక తో ఆమె సరైన నిద్ర లేకుంటే ఏర్పడే నష్టాలు వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల రంగు రంగుల వెలుగుల్లో కాలం గడుపుతున్న నేటి మానవులు రాత్రిని పగలు చేస్తున్నారని ఇలాంటి వెలుగులు వల్ల నిద్రలేమి సమస్యతో బాధపడుతుంటారని ఆమె అన్నారు. నిద్రలో పిల్లలకు మెలటోనిన్ హార్మోన్ విడుదల అవుతుందని దానివల్ల పిల్లల్లో శారీరక ఎదుగుదల సక్రమంగా ఉంటుందన్నారు. రాత్రి నిద్ర కోసం పెద్దలు పిల్లలు తప్పనిసరిగా నిర్దేశిత సమయాన్ని కేటాయించాలి.అప్పుడే పుట్టిన పిల్లలు 16 నుండి 18 గంటలు నిద్ర పోతారని, మూడు నెలల తరువాత 14,12,10 గంటల సమయం తగ్గుతూ వస్తుందన్నారు. కౌమార దశలో 8 గంటలు నిద్రకు కేటాయించాలని, కానీ నేటి పరిస్థితుల్లో టీ వి లు, సెల్ ఫోన్ ల ప్రభావం వల్ల నిద్ర పట్టలేని స్థితిలో అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఎల్ ఈ డి లైట్లు, టి వి స్క్రీన్ వల్ల అతినీల లోహిత కిరణాలు బ్లూ కిరణాలు వల్ల హార్మోన్ల సమతుల్యత దెబ్బతిని కార్టి సోల్ హార్మోన్ల ప్రభావంతో మానసిక వత్తిడి పెరుగుతుందని డాక్టరు శ్రీదేవి వివరించారు. మెదడుకు విశ్రాంతి ఎంతో అవసరమని అందుకే చిన్నా పెద్దా తేడా లేకుండా రాత్రి 8 గంటలకే ఇంట్లో లైట్లు ఆపేయాలని ఆమె సలహా ఇచ్చారు. ప్రపంచంలో సుమారుసగం మందికి కంటి నిండా నిద్ర కరవు! 59% మంది భారతీయులకు 6 గంటలకన్నా తక్కువ సేపే నిద్ర పోతున్నారు. దోమలు, సెల్ఫోన్లు వల్ల కంటికి కనిపించని నష్టం జరుగుతుందని ఆమె అన్నారు. గాఢంగా నిద్రప డితే చాలు చాలా రోగాలు దరి చేరవు.రోజుకు ఎనిమిది గంటల పాటుఎలాంటి అంతరాయాలు లేకుండా నిద్ర ఉండాలని చాలా మంది అనుకున్నా వారి వారి అలవాట్లు వల్ల దేశంలో 59% మందికి ఆ అదృష్టం లేకుండా పోతుంది.అంతరాయాలు లేని ఆరు గంటల నిద్ర వారికి కరవయింది. 61% పురుషులు,59% మహిళలల్లో 39% మంది 6-8గంటల పాటు నిద్ర పోతున్నారు.మరో 39 శాతం మంది 4-6 గంటల పాటు పడుకుంటున్నారు. కేవలం 2% మంది మాత్రమే 8-10 గంటలపాటు నిద్రపోతున్నారు. 20% మంది నాలుగుగంటల కన్నా తక్కువ సమయంపాటే పడుకుంటున్నారు. మొత్తంగా 59% మందికి ఆటంకాలు లేనిఆరు గంటల నిద్ర కరవయిందని ఆమె తెలిపారు. ఆలస్యంగా నిద్రపోవడం, త్వరగా లేవాల్సి రావడం, దోమల బెడద, సెల్ఫోన్లు,బయట శబ్దాలు, చిన్న పిల్లల అల్లరి తదితర కారణాల వల్ల సక్రమంగా నిద్ర పట్టని వారూ వున్నారు.



సూర్యాస్తమయం తరువాత ఎవ్వరూ ఏదీ తినకుండా వుండాలని ఆమె సలహా ఇచ్చారు.

## హోలీ పండగ సందర్భంగా సుగాలి మహిళలకు స్టీల్ బాక్సులు ( కానుక )వితరణ

### 13 సంవత్సరాలుగా హోలీ కానుకల పంపిణీ

### వందమందితో ప్రారంభించి నేడు వెయ్యి మంది వరకు అందజేత



**జగ్గయ్యపేట, మార్చి 13 (వార్తప్రభ)**పట్టణం లోని మణికంఠ స్టీల్ ఎంపోరియం అధినేత జిల్లా వాసవి సేవా సమితి అధ్యక్షుడు యన్నాకుల రాంబాబు ఆధ్వర్యంలో హోలీ పండుగ సంద ర్భంగా గురువారం సుగాలి మహిళ లకు స్టీల్ బాక్సులు పంపిణీచేశారు. గత 13 సంవత్సరాలుగా హోలీ సందర్భంగా సుగాలి మహిళలకు తన కానుకగా స్టీల్ సామాగ్రిని పంపిణీ చేస్తున్నారు. తొలుత తన దుకాణానికి వచ్చే సుగాలి మహిళ లు 100 మందితో ప్రారంభించిన ఈ కార్యక్రమం 13 ఏళ్లలో 1000 మంది పైగా మహిళలు కానుకలు స్వీకరించేందుకు వస్తున్నారు. అయినప్పటికీ సంవత్సరానికి ఒకసారి మహిళలకు ఈ విధంగా తనకు తోచిన కానుకలు అందజేస్తు న్నానని తన వారసత్వాన్ని తన కుమారులు కూడా కొనసాగించేం దుకు ముందుకు రావడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ఆయన చెప్పారు.జిల్లా వాసవి సేవాసమితి గౌరవాధ్యక్షులు పేరూరి నరసింహారావు కార్యదర్శి పెనుగొండ రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాకరపర్తి సోమేశ్వరరావు, జిల్లా ఏపిఎంపిఏకార్యదర్శి కళ్యాణపు సూర్య ప్రకాష్ నియోజకవర్గ అధ్యక్షుడు కాకరపర్తి రమేష్ పాల్గొన్నారు. యన్నాకుల రాంబాబు కుటుంబ ఔదార్యాన్ని ప్రశంసించారు.

## సునీతా విలియమ్స్ రాక ఆలస్యం



**ఫ్లోరిడా** : మూడోసారి రోదసిలోకి వెళ్లిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లను భూమిపైకి తిరిగి తీసుకొచ్చేందుకు నాసా-స్పేస్‌ఎక్స్‌లు ప్రయోగించిన క్రూ 10 మిషన్ వాయిదా పడింది. సాంకేతిక సమస్య తలెత్తడంతో అమెరికాలోని ఫ్లోరిడా నుంచి నలుగురు వ్యోమగాములతో ఫాల్కన్ 9 రాకెట్ బయలుదేరేందుకు క్రూ 10 మిషన్ ప్రయోగం నిలిచిపోయింది.హైడ్రాలిక్ సిస్టమ్‌లో సమస్య ఉత్పన్నం కావడంతో దీన్ని ఆపేసినట్లు నాసా పేర్కొంది. సమస్యను పరిష్కరించి ఈ వారంలో మరో ప్రయోగం చేయనున్నట్లు తెలిపింది. దీంతో వ్యోమగాముల రాక మరికొన్ని రోజులు ఆలస్యం కానున్నట్లు తెలుస్తోంది. కాగా సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లు దాదాపు తొమ్మిది నెలలుగా అంతరిక్ష కేంద్రంలోనే చిక్కుకుపోయిన విషయం తెలిసిందే.

## హేమాద్రి సిమెంట్స్ తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లో తీసుకోవాలి.

### సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ .సి హెచ్ .శ్రీనివాస్ డిమాండ్

**జగ్గయ్యపేట జగ్గయ్యపేట మార్చి 13 (వార్తప్రభ)** మండలంలోని వేదాద్రి గ్రామ సమీపంలో గల హేమాద్రి సిమెంట్స్ లో అక్రమంగా తొలగించిన కాంటాక్టు ఎన్ ఎం ఆర్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సి హెచ్ శ్రీనివాస్, జగ్గయ్యపేట మండల సిఐటియు కార్యదర్శి ఎస్.కే.గౌస్ మియా, ఉపాధ్యక్షులు కోట రవి లు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలోని వేదాద్రి సిమెంట్స్ లో అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న కాంట్రాక్ట్, ఎన్.ఎం.ఆర్ లను యాజమాన్యం మార్చి 1 నుండి ఎటువంటి నోటీసు లేకుండా అక్రమంగా విధులు నుండి తోలగించారని అన్నారు. ఫ్యాక్టరీ అభివృద్ధికి కార్మికులు కృషి చేశారని అర్ధాంతరంగా పని నుండి నిలిపివేయడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కనీసం వారికి రిట్రెంచ్మెంటు బెనిఫిట్స్ కూడా ఇవ్వలేదని తెలిపారు. పి.ఎఫ్ సక్రమంగా చెల్లించలేదన్నారు. ఫ్యాక్టరీలో కనీస వేతనాలు చట్టాలు అమలు చేయలేదన్నారు. ఫ్యాక్టరీ నష్టాలకు యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమన్నారు. సిమెంట్ ఇండస్ట్రీ అత్యధిక లాభాలు వచ్చే ఇండస్ట్రీ అన్నారు. యాజమాన్యం నిర్వాహణ లోపాలు సరి చేసుకోకుండా కార్మికులను తొలగించడం అన్యాయం అన్నారు. ఫ్యాక్టరీ లో ఉత్పత్తి ప్రారంభించడానికి ఉన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన యాజమాన్యం పరిష్కరించుకోవాలని, ఫ్యాక్టరీ రన్ చేయాలన్నారు. తొలగించిన ప్రతి కార్మికుడిని విధుల్లోకి తీసుకోవాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని కార్మికులను విధుల్లోకి తీసుకునేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన




**జగ్గయ్యపేట మార్చి 13 (వార్తప్రభ)**నూజివీడు బార్ అసోసియేషన్ న్యాయవాది కొలుసు సీతారామ్ పై దాడిని ఖండిస్తూ అదే విధంగా న్యాయవాది పట్ల పోలీసుల దురుసు ప్రవర్తనను నిరసిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ సమున్నత న్యాయవాదిపై అక్రమ చర్యలను ముక్తఖంఠంతో ఖండించారు.ఈ కార్యక్రమంలో అన్నెపాగ సుందరరావు,బద్దుల వెంకటరామయ్య,యర్రమాస్ ధనుంజయుడు, గోనెల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ గౌడ్, జంగా నరసరాజు,ఎం ఆంజనేయులు, పూల నాగరాజు, జి ఫణికుమార్,కిషోర్, అశోక్ , నరేష్, చిన్న గాంధీ, అంకమ్మ రాజు, రవి,రాజశేఖర్,బూడిద నరసింహరావు, గురువుల రాజు, శేషు కుమారి తదితరులు పాల్గొన్నారు.

## మీ మీ సంపాదన జరిమానాలకు కేటాయించ కుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

● కష్టపడి ఇంటికి వెళ్లెప్పుడు మీ కుటుంబ సభ్యులకు మీరు ఆనందంగా కనిపించాలి
● వాహన చోదకులకు ట్రాఫిక్ ఏ డి సి పి ప్రసన్న కుమార్ హితవు





**విజయవాడ పశ్చిమ మార్చి 13 వార్తా ప్రభ ప్రతినిధి**ఆరుగాలం శ్రమించి సంపాదించిన సొమ్ము లో కొంత భాగం జరిమానాలకు కేటాయించకుండా ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తే బాగుంటుందని నగర ట్రాఫిక్ ఏ డి సీ పి ప్రసన్న కుమార్ వాహన చోదకులకు హితవచనాలు పలికారు.వన్ ట్రాఫిక్ ఏసిపి రామచంద్రరావు ,వన్ ట్రాఫిక్ సెక్టర్ 1 సిఐ ఉమామహేశ్వర రావు ,వాహనాల తనిఖీలో భాగంగా సీతమ్మ వారి పాదాలు వద్ద ""నో యూనిఫామ్ నో ఎంట్రీ, నో హెల్మెట్ నో ఎంట్రీ ""అను నినాదంతో గురువారం హెల్మెట్ లేని ద్విచక్ర వాహనాలు, యూనిఫామ్ ధరించని ఆటో డ్రైవర్ లను ప్రకాశం బ్యారేజ్ వైపు అనుమతించకుండా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ ఏడిసిపి ప్రసన్నకుమార్ వాహనాల డ్రైవ్ నీ ఆకస్మిక తనిఖీ చేశారు. దీనిలో భాగంగా యూనిఫామ్ లేని ఆటో డ్రైవర్లను మరియు హెల్మెట్ దారులను ఆపి ""మీరందరూ రోజువారి పనులు చేసుకొని ఆటోలు తోలుకొని జీవిస్తున్నారని, మరియు చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నారని , ఇలా హెల్మెట్ లేకుండా , యూనిఫాం లేకుండా ఆటో నడపడం వల్ల మీకు విధించే చలానాలు కట్టుకుంటూ పోతే కుటుంబ జీవనం కష్టతరం అవుతుందని, ప్రతి ఒక్కరు పేద, మధ్యతరగతి నుండి వచ్చిన వారే అని ,కావున దయచేసి అందరూ హెల్మెట్ ధరించడం , యూనిఫాం వేసుకుని ఆటోలు తోలడం, వాహనాల పత్రాలన్నీ ఫోన్లో ఉంచుకోవాలని హితవు పలికారు. తద్వారా జీవన పురోగతితో పాటుగా ప్రతి ఒక్కరూ తమ కుటుంబాన్ని ఉన్నతంగా ఉంచుకోవాలని కోరారు. ప్రతి కుటుంబంలో ద్విచక్ర వాహనం వేసుకుని రోడ్డు మీదకు వచ్చిన తర్వాత మరల ఇంటికి వచ్చేంతవరకు వాళ్ళ కుటుంబ సభ్యులు వాళ్లకోసం ఎదురు చూస్తూ ఉంటారని కావున ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి క్షేమంగా ఇంటికి తిరిగి వెళ్లాలని కోరారు . ఈ యొక్క స్పెషల్ డ్రైవ్ లో గతంలో వాహనాలపై ఉన్న పెండింగ్ చలానాలను కట్టించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీధర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థికి స్పోర్ట్స్ కిట్ అందజేత




**విజయవాడ పశ్చిమ మార్చి 13 వార్తా ప్రభ ప్రతినిధి**ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో సాఫ్ట్ టెన్నిస్ లో ప్రతిభ కనబరిచిన బి ఎస్ యం వి కార్తీక్ కు రూ 25000 వేల విలువైన స్పోర్ట్స్ కిట్ ను అందించారు. కార్తీక్ 2024 లో మధ్యప్రదేశ్ దివాస్ లో జరిగిన (యస్ జి ఎఫ్) సాఫ్ట్ టెన్నిస్ లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అండర్ - 17 కేటగిరీలో తృతీయ స్థానం సాధించాడు. విజ్ఞాన విహార స్కూల్లో 10వ తరగతి చదువుతున్న కార్తీక్ఎమ్మెల్యే సుజనా చౌదరిని కలిసి తనను మరింత ప్రోత్సహించాలని కోరడంతో స్పోర్ట్స్ కిట్ అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. సుజనా ఫౌండేషన్ సహకారంతో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ గురువారం భవానిపురం లోని ఎన్డీయే కార్యాలయంలో స్పోర్ట్స్ కిట్ ను అందజేశారు.ఎమ్మెల్యే సుజనా చౌదరి కు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## 50కి పైగా మదర్సాలకు సీల్ ..

### అధికార దుర్వినియోగం : ముస్లిం వర్గాలు

**డెహ్రాడూన్** : రెండు వారాల్లో 50కి పైగా మదర్సాలను ఉత్తరాఖండ్ ప్రభుత్వం మూసివేయడాన్ని ముస్లిం సంస్థలు తీవ్రంగా వ్యతిరేకించాయి. మదర్సాలపై సీల్ అధికార దుర్వినియోగానికి నిదర్శమని మండిపడ్డాయి. ముస్లిం మతపరమైన విద్యా సంస్థలపై దాడులను అధికార దుర్వినియోగంగా ముస్లిం సేవా సంఘటన్ అధ్యక్షుడు నయీమ్ ఖురేషి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అక్రమ ఇసుక తవ్వకాలు, చెట్ల నరికివేత, అవినీతి వంటి సమస్యల నుండి దృష్టి మళ్లించేందుకు బిజెపి ప్రభుత్వం మైనారిటీలపై దాడికి దిగుతోందని అన్నారు. రాష్ట్రంలో నేరాలు పెరిగాయని, ఉద్యోగాలు లేవని అన్నారు. మదర్సాలకు ఎటువంటి గుర్తింపు అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. మదర్సాలకు ముందస్తు నోటీసులు ఇవ్వలేదని, ఒక్కో మదర్సాలో 2,000 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని ఖరేషి పేర్కొన్నారు. ఇప్పుడు ఆ విద్యార్థుల పరిస్థితి ఏమిటని ప్రభుత్వాన్ని నిలదీశారు. మార్చి 1 నుండి రాష్ట్ర రాజధాని డెహ్రాడూన్‌లో దాదాపు 42 మదర్సాలను సీల్ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. మిగిలిన పదింటిని నేపాల్ పొరుగునే ఉన్న ఉధమ్ సింగ్ నగర్‌లోని ఖతిమాలో సీల్ చేయబడినట్లు తెలిపాయి. కొన్నింటికీ రిజిస్ట్రేషన్ లేదని, ఇవన్నీ అక్రమ, అనధికారిక నిర్మాణాలుగా తేలినట్లు ఆరోపించాయి. రాష్ట్ర సిఎం పుష్కర్ సింగ్ ధామి ఆదేశాల మేరకు ఈ ఏడాది జనవరి నుండి ముస్లిం విద్యాసంస్థల గుర్తింపు డ్రైవ్ చేపట్టామని తెలిపాయి.

## అన్నా క్యాంటీన్లలో మెనూ కచ్చితంగా అమలయ్యేలా చర్యలు

### - నిర్వహణపరంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరంతర పర్యవేక్షణ- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ.. మార్చి 13 (వార్తాప్రభ)** రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన అన్నా క్యాంటీన్లలో మెనూ కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవడం జరిగిందని.. అదే విధంగా నిర్వహణపరంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరంతర పర్యవేక్షణ ఉంటోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.కలెక్టర్ లక్ష్మీశ గురువారం రాత్రి విజయవాడ అర్బన్, వన్‌టౌన్ గాంధీ మహిళా కళాశాల వద్ద అన్నా క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. టోకెన్ కౌంటర్, డైనింగ్ ఏరియాతో పాటు స్వచ్ఛమైన తాగునీరు అందించే ఏర్పాట్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు చేసిన ఏర్పాట్లు, మరుగుదొడ్లు తదితరాలను కూడా పరిశీలించారు. భోజనం నాణ్యత ఎలా ఉందో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. మంచి ఆహ్లాదకర, పరిశుభ్రమైన వాతావరణంలో పేదలు భోజనం చేసేందుకు ప్రభుత్వం ఆవకాశం కల్పించిందన్నారు.ఆకలితో ఉన్నవారికి పట్టెడన్నం పెట్టడం ద్వారా ఎంతో సంతృప్తి సొంతమవుతుందని.. ఇలాంటి ఓ మంచి కార్యక్రమంలో భాగమవుతున్న సిబ్బంది నిబద్ధత, సేవా దృక్పథంతో సేవలు అందించాలని సూచించారు. ప్రతి క్యాంటీన్‌లోనూ అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యాంటీన్ల నిర్వహణకు ప్రత్యేకంగా ఇన్‌ఛార్జ్‌లకు బాధ్యతలు అప్పగించడం జరిగిందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

## ఆల్కహాల్, వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ అధిక పన్నులు వేస్తోంది

**వాషింగ్టన్** : భారత్ తన ఉత్పత్తులపై అధిక సుంకాలు వసూలు చేస్తోందని అమెరికా మరోసారి ఆరోపించింది. అమెరికా ఆల్కహాల్, వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ ఎక్కువ సుంకాన్ని విధిస్తోందని శ్వేతసౌధం పత్రికా కార్యదర్శి కరోలిన్ లీవెట్ చెప్పారు. కెనడాపై విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ ఆమె ఈ విషయాన్ని ప్రస్తావించారు. 'కెనడా కొన్ని దశాబ్దాలుగా అమెరికాను, అమెరికా ప్రజలను నానా ఇబ్బందులు పెడుతోంది. ఇక్కడి అమెరికా ప్రజలు, కార్మికులపై కెనడా వారు విధిస్తున్న సుంకాలను చూస్తుంటే అవి ఎంత విపరీతంగా ఉన్నాయో తెలుస్తుంది.

## నిర్లక్ష్యం ప్రమాదం




నిర్లక్ష్యపు నీడలో
ఉన్నావంటే నేస్తము!
కాలనాగు పడగ కింద
ఉన్నట్టే అని అర్థము
చెప్పనలవి కాదు కాదు
నిర్లక్ష్యం దుష్ఫలితాలు
గత అనుభవాలు చూస్తే
కోకొల్లలు ఆనవాళ్లు
ఎప్పుడైనా కాటేయును
జీవితాన నిర్లక్ష్యము
నష్టమెంతో తెచ్చును
దానికుండు బహు దూరము
దేనిలోనూ! నిర్లక్ష్యము
వద్దు వద్దు సోదరా!

బుద్ధి తెచ్చుకొని కాస్త
ఇకనైనా మానరా!
ఎవరిని నిర్లక్ష్యంగా
ఎప్పుడూ చూడవద్దు
చేస్తున్న పనిలోనూ
ఉదాసీనత చూపవద్దు
నిర్లక్ష్యం భూతానికి
బలి చేయకు జీవితాలు
వాయిదాలు వేసి వేసి
తెచ్చుకోకు నష్టాలు

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు

# కళింగుల అభ్యున్నతికి రాజగోపాలరావు విశేషకృషి..

● కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు



**గుడివాడ,మార్చి 13 (వార్తాప్రభ) :** స్థానిక బైపాస్ రోడ్డు లోని యలవర్తి అపార్ట్మెంట్స్‌లో కళింగ ఐక్య సేవా సంఘం ఆధ్వర్యంలో కీర్తిశేషులు మాజీ పార్లమెంటు సభ్యులు బొడ్డేపల్లి రాజగోపాలరావు 102వ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత పలువురు కళింగ ఐక్య సేవ సంఘం పెద్దలు రాజగోపాలరావు చిత్రపటానికి నివాళు లర్పించారు. తరువాత ప్రముఖ సినీ రచయిత దర్శకుడు గూన అప్పారావు రచించిన రాజ బహుదూర్ అన్నెపు పరశురాం పాత్రో గారి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కళింగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు మాట్లాడుతూ రాజ్ బహుదూర్ అన్నెపు పరశురాం పాత్రో బడుగు బలహీన దళిత వర్గాల వారికి విద్యా సంస్థల్లో దేశంలోనే తొలిసారి రిజర్వేషన్ సౌకర్యాన్ని 1921 నవంబర్16 జీవో నెంబర్ 613 ద్వారా కల్పించిన మహనీయ వ్యక్తి బొడ్డేపల్లి రాజగోపాల్ రావు అని, ముఖ్యంగా కళింగ జాతి అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. రాజగోపాల్ రావు జయంతి రోజున రాజ్ బహుదూర్ అన్నెపు పరశురాం పాత్రో జీవిత చరిత్ర పుస్తకమును ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందని, ఇంత మంచి అవకాశం కల్పించిన పుస్తక రచయిత గూన అప్పారావుకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళింగ ఐక్య సేవా సంఘం గౌరవాధ్యక్షులు సూర నరసింహారావు, తమ్మినేని రామ్మోహన్‌రావు, సూర అక్కారావు, ఆగస్తి రాము, బెండి సత్యనారాయణ (బి.ఎస్.ఎన్), బుడుమూరి జోగేశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్, కింతల,మురళీ, బొడ్డేపల్లి రామాంజనేయులు, బుడుమూరి శ్రీనివాసరావు, తమ్మినేని వెంకట దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు ని సన్మానించిన మూల్పూరి సాయి కళ్యాణి

● శ్రీవారి ఆలయ పవిత్రతను కాపాడుతూ, ప్రతిష్టను పెంచేలా బీఆర్ నాయుడు చర్యలు చేపడుతున్నారు ● తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మూల్పూరి సాయి



**హనుమాన్ జంక్షన్,మార్చి 13 (వార్తాప్రభ) :** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన మూడు రాజధానుల ప్రకటనతో అమరావతి ప్రాంత రైతుల వెంట ఉండాలని నిర్ణయించుకుని, ఎన్ని కేసులు పెట్టి వేదించినా వెనకడుగు వేయకుండా అమరావతి రైతులకు తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, బొల్లినేని రాజగోపాల్ నాయుడు అండగా నిలిచారని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణీ కొనియాడారు. ఈక్రమంలో వెలగపూడిలోని వి-స్క్వేర్ ఫంక్షన్ హాల్లో రాజధాని రైతుల ఐకాస ఆధ్వర్యంలో గౌరవఅతిథిగా విచ్చేసిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కి అమరావతి రైతుల ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బిఆర్ నాయుడు కి పట్టు వస్త్రంతో సత్కరించి, పూలమొక్కను సాయి కళ్యాణి అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు అంగన్వాడీ-డ్వాక్రా సాధికార సంస్థ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బొప్పన నీరజ, తెలుగు రైతు రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ పెందుర్తి శ్రీకాంత్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు. సాయి కళ్యాణి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్ల బిఆర్ నాయుడు కి అచంచలమైన నిబద్ధత, హిందూ సనాతన ధర్మాన్ని నిలబెట్టడానికి ఆయన చేసిన కృషిని సాయి కళ్యాణి ప్రశంసించారు. శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా వ్యవహరిస్తూ, ఆలయ పవిత్రతను కాపాడుతూ, ప్రతిష్టను పెంచేలా బిఆర్ నాయుడు చర్యలు చేపడతున్నారాని తెలిపారు. అమరావతి రాజధాని ఉద్యమం విజయవంతం అయినందుకు ఈనెల 15వతేదీన సాయంత్రం అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డులోని వెంకటపాలెంలోని టీటీడీ శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవంలో రైతులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని సాయి కళ్యాణి కోరారు.

# హిందువుల పై దాడిని సీరియస్ గా తీసుకోండి



**మచిలీపట్నం,మార్చి 13 (వార్తాప్రభ) :** హిందువులపై జరిగిన దాడిని పోలీస్ వర్గాలు సీరియస్ గా తీసుకోవాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని కృష్ణా జిల్లా ఎస్పీ కి వినతిపత్రం సమర్పించారు. రాయచోటి లో హిందువుల మీద జరిగిన లాఠీ చార్జి మీద విశ్వ హిందూ పరిషత్ సభ్యులు జిల్లా కార్యదర్శి అల్లూరి కాంతారావు , మచిలీపట్నం ప్రఖండ అధ్యక్షులు పులపర్తి శ్రీనివాసరావు , మోపిదేవి ఖండ అధ్యక్షులు అర్జ ఏడుకొండలు, ప్రముఖ న్యాయవాది, బిజెపి నాయకులు కూనపు రెడ్డి శ్రీనివాసరావు ,జిల్లా ప్రచార ప్రముఖ్ గరికిపాటి వెంకట్రావు , డా. ఉడత్తు శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జగన్ ను భూబకాసురుడు అనడం కరెక్ట్ కాదు: బొత్స సత్యనారాయణ

**అమరావతి,మార్చి 13 (వార్తాప్రభ) :** ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వం నుంచి సరైన సమాధానాలు రావడం లేదని శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. 2014 నుంచి జరిగిన స్కామ్ లపై మాట్లాడాలని తాము అడిగామని... అమరావతి భూములు, స్కిల్ డెవలప్ మెంట్ స్కామ్, అగ్రిగోల్డ్ దందాలు అన్నింటిపై విచారణ జరపాలని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ ను భూబకాసురుడు అని అనడం సరికాదని చెప్పారు. నిరాధార ఆధారాలు చేయడం సరికాదని అన్నారు. కూటమి ప్రభుత్వానికి దశ, దిశ లేదని బొత్స విమర్శించారు. తమపై వచ్చిన ఆరోపణలను తాము ఖండించలేదని... మీ దగ్గర ఆధారాలు ఉంటే చూపించాలని కోరుతున్నామని చెప్పారు. సభలో లేని వ్యక్తి గురించి మాట్లాడటం కరెక్ట్ కాదని అన్నారు. అమరావతిలో జరిగింది భూకుంభకోణమని ఆరోపించారు.

# ప్రతి విద్యార్థి భవిష్యత్ ప్రణాళికను రూపొందించుకొని చదవాలి-డా.కె.అప్పారావు

● టెన్త్ విద్యార్థినులకు పరీక్షా సామాగ్రి అందజేత



**మైలవరం,మార్చి 13 (వార్తాప్రభ) :** ప్రతి విద్యార్థి భవిష్యత్ ప్రణాళికను రూపొందించుకొని చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు అని మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు అన్నారు.మైలవరం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో యల్.బి.ఆర్.సి.ఈ యన్.యస్.యస్.యూనిట్ మరియు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో 150 మంది టెన్త్ విద్యార్థులకు పరీక్షా కిట్ లను కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు గురువారం అందచేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసంగిస్తూ ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా చదవాలని పరీక్ష రాసే సమయంలో పేపర్ పైన చదివిన దాన్ని మంచిగా వ్రాయాలని తద్వారా మంచి మార్కులు సంపాదించవచ్చని తెలిపారు.మనస్సును ప్రశాంతంగా ఉంచుకొంటే చదివిన వాటిని బాగా గుర్తుంచుకుంటారని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు IIIT వంటి చక్కని విద్యా సంస్థలు ఉన్నాయని వాటిల్లో సీటు సంపాదిస్తే వారి భవిష్యత్ బంగారు మయమవుతుందన్నారు.మైలవరం ఇతర ప్రాంతాల వారి కోసం లకి రెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటుచేశారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యన్.యస్.యస్ ప్రోగ్రాం అధికారి డా.బి.శివ హరి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థిని,విద్యార్థులు మారుతున్న విద్యా విధానాన్ని బట్టి తమ ఆలోచలను మార్చు కోవాలని భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకొని నిర్దిష్ట ప్రణాళికలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విధ్యాకుసుమాలు ఎందరో ఉన్నారని వారి లాగే మీరు కూడా చదువుల్లో రాణించాలని, 10 కి 10 జిపిఎ (GPA) తెచ్చుకుని స్కూల్ కు మరియు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.విద్యార్థిని, విద్యార్థులకు పరీక్షా విధానంపై మెళకువలు, మంచి మార్కులు పొందే విధానం మరియు పదవ తరగతి తర్వాత ఏయే కోర్సులు అభ్యసిస్తే ఎలాంటి ఉద్యోగ అవకాశాలు ఉంటాయో వివరించారు.ఈ కార్యక్రమంలో అల్యూమిని కో ఆర్డినేటర్ టి.అనిల్ రాజ్ , ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ సెక్రటరీ అండ్ ట్రెజరర్ గూడూరు నాగిరెడ్డి, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి.లక్ష్మి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మూలనపడ్డ "చెత్త" వాహనాలు..

● మండలానికి కేటాయించిన ట్రాక్టర్, ట్రక్కు కూడా ....





**మోపిదేవి,మార్చి 13 (వార్తాప్రభ) :** ప్రభుత్వం లక్షలు ఖర్చు పెట్టి చెత్త వాహనాలను గ్రామపంచాయతీలు అందించగా, వాటిని నిర్వహించలేని స్థితిలో గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భాగంగా మండల కేంద్రమైన మోపిదేవి సచివాలయం - 2 లో తడి చెత్త - పొడి చెత్త వాహనం మూలనపడింది. దీంతో పాటుగా గత ఐదు సంవత్సరాల కిందట టిడిపి ప్రభుత్వంలో మండలానికి కేటాయించిన నూతన కొత్త టాక్టర్ మరియు డ్రైనేజీలు క్లీన్ చేసే ట్రక్కుతో కూడిన బకీటు కలిగిన ట్రక్కు మూలన పడి పిచ్చి మొక్కలలో తుపెక్కిపోతున్నాయి. వాటిని పట్టించుకునే నాధుడే కరువయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో తడి చెత్త , పొడి చెత్త వాహనాలను ఇవ్వగా, అవి డ్రైవర్ లేక వాటి నిర్వహించే సామర్థ్యం లేక మోపిదేవి సచివాలయం - 2 లో పక్కన పెట్టేశారు. స్వర్ణాంధ్ర , స్వచ్ఛ ఆంధ్ర పేరుతో ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో మండల కేంద్రాల్లో స్వర్ణాంధ్ర, స్వచంద్రాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అసలు కృష్ణా జిల్లా కలెక్టర్ ఆదేశాలు అమలు అవుతాయా....? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. కనీసం ప్రభుత్వం సమకూర్చిన వాహనాలను కూడా వినియోగించుకునే పరిస్థితిల్లో కూడా ఈ గ్రామపంచాయతీలు లేవని, మోపిదేవి గ్రామపంచాయతీ పరిధిలో తడి చెత్త, పొడి చెత్త వాహనాలను ఉపయోగించుకోవాలని అలాగే డ్రైనేజీలు క్లీనింగ్ కి బకెట్ తో కలిగిన ట్రక్కును కూడా వినియోగించుకోవాలని మోపిదేవి గ్రామస్తుల కోరుతున్నారు. దీనిపై గ్రామపంచాయతీ ఈవో మల్లేశ్వరరావు మాట్లాడుతూ తడి చెత్త , పొడి చెత్త వాహనం రిపేర్ వచ్చిందని అందుకే పక్కన పెట్టామని రిపేరు చేయించాలని అలాగే డ్రైవర్ ని కూడా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఇక ట్రాక్టర్ మరియు బకెట్ తో కలిగిన ట్రక్కును మండలానికి కేటాయించినవని అవి మండలం చూసుకోవాలని తెలిపారు. గత ఐదు సంవత్సరాల నుండి కొత్త ట్రాక్టర్, ట్రక్కుఅక్కడే ఉంటుందని తెలిపారు. దీనిపై జనసేన పార్టీ నాయకులు కోసూరు రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి వెంటనే ఈ వాహనాలను వినియోగంలోకి తేవాలని కోరారు. ఈ వాహనాలపై అర్జీలు కూడా సమర్పించామని తెలిపారు. సచివాలయాల్లో వాహనాలు తుపెక్కిపోతున్నాయని వాటిని వినియోగంలోకి తేవాలని కోరారు.

# ఘనంగా మహా కవయిత్రి మొల్ల జయంతి



**గుడివాడ,మార్చి 13 (వార్తాప్రభ) :** షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో తెలుగు భాషా వికాస్ సమితి ఆధ్వర్యంలో మహా కవయిత్రి మొల్లమాంబ జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏఎన్ఆర్ కళాశాల పూర్వపు తెలుగు శాఖ అధిపతి డాక్టర్ కొడాలి సోమ సుందర్రావు మాట్లాడుతూ 16వ శతాబ్దంలో కవయిత్రి మొల్ల రచించిన రామాయణం ఆధ్యాత్మిక గ్రంథాలకు మణిమకుటముగా బాసిల్లింది అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ ఉపాధ్యాయిని చక్కా శకుంతలకు మహాకవయిత్రి మొల్ల సాహితీస్ఫూర్తి పరిష్కారం 2025 ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష వికాస సమితి సమన్వయకర్త డి.ఆర్.బి ప్రసాద్, గ్రంథాలయ అధికారి బీరం వెంకటరమణ, సాహితీవేత్తలు మోహన్ బాబు, చోడవరపు రూప, కొమ్ముల సురేష్, ఆర్యవైశ్య మండల కమిటీ అధ్యక్షురాలు తాతా పద్మలత, వాసవి అధ్యక్షురాలు చలువాది లక్ష్మి సురేఖ, ఆచూరి శ్రీనివాస్, ఆవిర్నేని వెంకటేశ్వరరావు, నరహరిశెట్టి ప్రసాద్, మామిడి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మినుము పంటపై వచ్చిన ఫిర్యాదు విచారణ..




**గుడివాడ,మార్చి 13 (వార్తాప్రభ) :** మినుముపై జల్లిన పురుగు మందు వల్ల పంట నష్టపోయిందని చిరిచింతల గ్రామానికి చెందిన రైతులు ఇచ్చిన ఫిర్యాదుపై గురువారం శాస్త్రవేత్తల బృందం పరిశీలించినట్లు మండల వ్యవసాయాధికారిణి బి. అనంత లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ కోటి, శ్రీదేవిలు ఇచ్చిన ఫిర్యాదులపై కెవిజె ఘంటశాల ప్రిన్సిపల్ సైంటిస్టు సుధారాణి, లహరిలు పరిశీలించడం జరిగిందన్నారు. వారు ఇచ్చిన నివేదికను బట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం మినుము తీస్తున్న రైతులను పొలం దిగుబడిపై అరా తీయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వి.ఎ.ఎ శ్రీకాంత్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



చిన కరగ్రహారం శ్రీ లక్ష్మి నాంచారమ్మ తల్లి దేవాలయంలో సంబరాలు సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న కృష్ణ జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ.. -మచిలీపట్నం,మార్చి 13 (వార్తాప్రభ) :

# మండల వైసిపి నూతన అధ్యక్షుడు ఓలేటి దుర్గారావు పేరు ప్రకటన

● తిరువూరు వైసిపి ఇన్చార్జి నల్లగట్ల స్వామిదాస్



**విస్సన్నపేట,మార్చి 13 (వార్తాప్రభ) :** స్థానిక మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఓలేటి దుర్గారావు పేరును తిరువూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ నల్లగట్ల స్వామిదాస్ ప్రకటించారు. స్థానిక కేఎంఆర్ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సీనియర్ వైసీపీ నాయకులు మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, జడ్పిటిసి సభ్యులు మాజీ మండల పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి, ఇన్చార్జి ఆర్ మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు గాజుల శ్రీనివాసరావు అధికార ప్రతినిధి ముంగా జయరాజు గ్రామ సర్పంచ్ సాదుపాటి నాగమల్లేశ్వరి కోటేశ్వరరావు మాజీ ఎంపీపీ భూక్యరాణి గ్రామ సర్పంచ్ కొండ పర్వ ఆర్ రమేష్ కలగర వైసిపి సీనియర్ నాయకులు దేశి రెడ్డి శ్రీనివాస రెడ్డి, దామోదర రెడ్డి పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎన్ వి కుటుంబరావు నెక్కలపు సుబ్బారావు, శిరసాని ప్రకాష్ విసన్నపేట మాజీ సర్పంచ్ పి లక్ష్మయ్య ఎంపీటీసీ . గద్దల మల్లయ్య అప్పి రెడ్డి నాగాచారి.తిరువూరు ఏఎంసీ మాజీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి నటరాజు నాంచారయ్య సాదుపాటి కోటేశ్వరరావు పి సత్యనారాయణ పవన్ జాఫర్ బాబా కాలేషా భాస్కరరావు తదితరులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

# బీసీలు గర్వించ దగ్గ కవయిత్రి మొల్ల డాక్టర్ చప్పిడి



**కాకినాడ రూరల్,మార్చి 13 (వార్తాప్రభ) :** బీసీలు గర్వించదగ్గ మంచి కవయిత్రి సుమారు 500 సంవత్సరాల క్రితమే రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించిన మహా కవయిత్రి మొల్ల ఈమె కడప జిల్లాలో గోపవరం గ్రామానికి చెందినదిగా శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో ఉన్న కవయిత్రిగా చరిత్ర చెబుతున్నది కుమ్మరి అనే శాలివాహన బీసీ కులానికి చెందిన ఈమె ఆంధ్ర రాష్ట్రానికే కాదు భారత వన్ కి వన్నెతెచ్చిన మహాకవిత్రి అని శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డా. చప్పుడు వెంకటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టరు రాహుల్ మీనా విచ్చేసి గజ మాలతో ఆమె కాంస్య విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జగదీష్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ జయకృష్ణ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ మెంటారావు,కుమ్మరి సంఘ అధ్యక్షులు శ్రీనివాసరావు వీరభద్ర రావు గారు రాంబాబు శాలివాహన సంఘ నాయకులు అనేకమంది పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు తదుపరి చీరలు పంచి అన్నప్రసాద వితరణ కూడా జరిగింది. కార్యక్రమంలో రూరల్ ఎంఆర్ఓ బీసీ కార్పొరేషన్ కు చెందిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# ఉత్తమ ఆర్.పి మీరాబిని ఘనంగా సత్కరించిన గుడివాడ మహిళా వాకర్స్..



**గుడివాడ,మార్చి 13 (వార్తాప్రభ) :** మహిళా దినోత్సవం సందర్భంగా మెప్మా లో మన కృష్ణ జిల్లా లో ఎస్.కే. మీరాబి గారు కీ బెస్ట్ ఆర్పీ గా మన జిల్లా కలక్టర్ గారు ప్రశంస పత్రం తీసుకున్న ఆర్పీ గారికి ది గుడివాడ మహిళా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కారం చేసారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో పాల్గొన్న అసోసియేషన్ ప్రెసిడెంట్ యమ్. దీవెన మాట్లాడుతూ మీరాబి గారిని ప్రతి ఒక్క ఆర్పీ ఆదర్శంగా తీసుకొని మెప్మా పనివిభాగంలో ప్రతి ఒక్క ఆర్పీ ముందుకెళ్ళాలని ఆకాంక్షించారు. అలాగే ఉత్తమ గుడివాడ పురపాలక సంఘంగా జిల్లాలో, రాష్ట్రంలో మంచిపేరు తేవాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం మెప్మా అధికారి, సిబ్బంది, ది గుడివాడ మహిళా వాకర్స్ అసోసియేషన్ సెక్రటరీ వి. ప్రతిమ, ట్రెజరర్ యమ్. కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికతో జీవిత లక్ష్యాన్ని సాధించడం తేలిక..

● కెరియర్ కౌన్సిలర్ డా॥ శ్రీనివాస్




**గుడివాడ,మార్చి 13 (వార్తాప్రభ) :** జీవిత లక్ష్యాన్ని నిర్ధారించుకుంటే మంచి ముందస్తు ప్రణాళికతో ఆ లక్ష్యాన్ని సాధించడం చాల తేలికని కెరియర్ కౌన్సిలర్ డా॥ శ్రీనివాస్ ఏపూరి అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కాలేజీలో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తరగతులను నిర్వహించింది. మొదటి సెషన్లో డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు, రెండవ సెషన్లో డిగ్రీ మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు, కెరీర్ గైడెన్స్ కౌన్సిలర్ డాక్టర్ శ్రీనివాస్ ఏపూరి కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు చక్కటి వివరణాత్మక విశ్లేషణ చేసి వారికి అవగాహన కల్పించారు. తరువాత రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ సభ్యులు డా॥ శ్రీనివాస్‌ని దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు టి.ఎన్.రాజశేఖర్, కార్యదర్శి జి.కిరణ్ బాబు, ట్రెజరర్ నరహరిశెట్టి ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి జి.నరేష్, పూర్వ అధ్యక్షులు ఎం.రమణమూర్తి, సభ్యులు ఎ.జె.ప్రసాద్, బి.జ్యోతీస్వరరావు, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.రవీంద్రబాబు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పెందుర్తి జ్ఞాపకార్థం అన్నక్యాంటీన్‌లో అన్నదానం..




**గుడివాడ,మార్చి 13 (వార్తాప్రభ) :** బుధవారం పెందుర్తి ప్రసాద్ రావు 5వ వర్ధంతి సందర్భంగా మానవతా సభ్యురాలు పెందుర్తి పాపయమ్మ గారు ఏజీకే స్కూల్ నందుగల అన్నా క్యాంటీన్లో అన్నదాన కార్యక్రమానికి ఏర్పాటు చేసినారు. ఈ సందర్భంగా మానవత కృష్ణాజిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి, గుడివాడ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, వైస్ ప్రెసిడెంట్ దండమూడి సీతారామస్వామి, సభ్యులు పిన్నమనేని పూర్ణేందిరా, ఘంటసాల రామకృష్ణ, రాధాకృష్ణ, చంద్రశేఖరరావు లు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారనీ, వారందరికీ మానవతా సంస్థ గుడివాడ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు ధన్యవాదాలు తెలియజేసారు.

# తి.తి.దే వారిచే భగవద్గీత పుస్తకాల పంపిణీ..



**గుడివాడ,మార్చి 13 (వార్తాప్రభ) :** గురువారం తిరుమల తిరుపతి దేవస్థానం (తి.తి.దే) హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉచితంగా "మానవులందరికి భగవద్గీత" అనే శీర్షికతో గలిగిన భగవద్గీత పుస్తకాన్ని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో తి.తి.దే గుడివాడ విశిష్ట ధర్మాచార్య కావూరి శ్రీధర్, పాఠశాలల ప్రెసిడెంట్ శ్రీమతి వల్లూరిపల్లి లక్ష్మీ గారు, మహిళా సంఘం సభ్యులు శ్రీమతి వి. జయవేణి గార్ల చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. తదుపరి పాఠశాల విద్యార్థులకు సుమారు ఎనిమిది వందల (800) పుస్తకాలు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి జి. పద్మావతి గారు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఫోర్స్మెంట్ ఆకస్మిక దాడులు 41 మద్యం బాటిళ్లు స్వాధీనం



**పెడన,మార్చి 13 (వార్తాప్రభ) :** పల్లె తాళ్లపాలెం గ్రామంలో గురువారం నాడు ఎక్సయిజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడిచేసి 41 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పరసా వీరయ్య అనే వ్యక్తి నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ అతన్ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసారు.ఈ దాడుల్లో సిబ్బంది వసంత్ వినోద్ ఉష హరీష్ పాల్గొన్నారు.

## గ్రామ పంచాయితీ కార్యాలయం, నడుపూరు
### టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.నిల్/2025 తేది. 13.03.2025.

కృష్ణాజిల్లా, పెదన మండలం, నడుపూరు గ్రామ పంచాయితీలో ఒక సంవత్సర కాలం 2025-26 ఆర్థిక సంవత్సరమునకు అనగా (ది.01.04.2025 నుండి 31.03.2026 వ తేదీ వరకు) కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయుటకు ఈ దిగువ పనులు చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షరతులు ఇతర వివరములు కార్యాలయం పనిచేయు వేళలో తెలుసుకొనవచ్చును. సదరు టెండర్లు ది.24.03.2025 వ తేదీ ఉదయం గం. 11-00ల వరకు ఈ దిగువ సంతకం చేసిన వారికే గానీ,వారి అనుమతి పొందిన వారికే గానీ స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు ఉదయం గం. 11-30ని.లకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో తెరువబడును.

| వ.నెం | పని వివరము | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | ట్యాంకు వాచర్‌గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- |
| 2) | ఎలక్ట్రీషియన్ గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- |
| 3) | స్వీపర్‌గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- |

నోట్ :-
1. గతంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. పంచాయితీ నిధుల నిల్వలను బట్టి చెల్లింపులు జరుపబడును

సం/- చీర్ల అనూష
సర్పంచ్
నడుపూరు గ్రామ పంచాయితీ

సం/- షేక్ రఫీఖుద్దీన్
కార్యదర్శి
నడుపూరు గ్రామ పంచాయితీ

# నేటి నుంచి చిన్న తిరునాళ్ళ మహోత్సవాలు

● విద్యుత్ కాంతులతో.... తిరుపతమ్మ ఆలయం.




**పెనుగంచిప్రోలు,మార్చి 13 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో వెంచేచి వున్న శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి చిన్న తీరుణాలు నేటి నుంచి ప్రారంభ మవుతా యని ఆలయ కార్యానిర్వాహాణాదికారి మరియు డిప్యూటీ కమిషనర్ కిశోర్ కుమార్, చైర్మన్ జంగాల. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ శుక్రవారం 14 తేదీ నుండి చిన్న తిరుణాళ్ళు మొద లై య్యే 18 తేదీ మంగళవారం వరకు చిన్న తిరుణాళ్ళ మహోత్సవాలు కొనసాగు తాయని తెలిపారు.భక్తులకు అసౌకార్యలు కలుగకుండా ఏర్పాట్లు చేశామని 14 తేదీ ఉదయం 6-2 నిముషాలకు అఖండ జ్యోతి స్థాపనతో ఉత్సవాలు ప్రారంభం అవు తాయని 15 తేదీ శనివారం సాయంత్రం 6-56 నిముషాలకు ప్రభోత్సవం జరుగు తుంది,16 తేదీ ఆదివారం రాత్రి 9-05 నిముషాలకు దివ్య ప్రభోత్సవం జరుగుతుంది అని, 17 తేదీ సోమవారం సాయంత్రం 53 నిముషాలకు అమ్మ వారి పుట్టింటి నుండి పసుపు కుంకుమ లు తీసుకోని యడ్ల బండ్లపై అనిగండ్ల పాడు నుండి పెనుగంచిప్రోలు అమ్మ వారి ఆలయం కు చేరుకుంటారు, 18 తేదీ మంగళవారం ఉదయం 5-30 నిముషాల నుండి భక్తులు అమ్మ వారికి బోనాలు సమర్పిస్తారు, 18 తేదీ తో చిన్న తిరునాళ్ళ ముగుస్తుంది అని తెలిపారు, అలాగే తిరునాళ్ళ సందర్భంగా పలు రకాల దుకాణాలు,ఎగ్జ్ బిషన్లు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు, విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అత్యంత శోభయ్యమానంగా అలంకరించి నట్లు తెలిపారు, వచ్చిన భక్తులకు మున్నేటిలో జల్లు స్థానాలు ఏర్పాట్లు చేసి నట్లు తెలిపారు, కనుక వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ అయిదు రోజులు ఉత్సవాలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకున్నాట్లు తెలిపారు, అన్ని ప్రభుత్వ శాఖలు సక్రమంగా విధులు నిర్వహించ నున్నట్లు తెలిపారు,

# మొల్లమాంబ తెలుగు సాహిత్య సేవలు చిరస్మరణీయం..

● కవయిత్రి మొల్లమాంబ(మొల్ల) జీవితం ఆదర్శనీయం. ● జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.



**విజయవాడ,మార్చి 13 (వార్తాప్రభ) :** రామాయణాన్ని సంస్కృతము నుండి అందరికి అర్ధమయ్యే రీతిలో తెలుగు భాషలోకి అనుమదించిన తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) అందించిన సాహిత్య సేవలు, చిరస్మరణీయంగా నిలిచిపోతాయని మొల్ల జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ అన్నారు. తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) జయంతి సందర్భంగా గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కవయిత్రి మొల్ల జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ ముఖ్య అతిదిగా హాజరై ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు రచయిత్రి కీర్తిశేషురాలు మొల్ల చిరుప్రాయంలోనే శ్రీరామ చరిత్రను వచన కావ్యంగా రచించారన్నారు. మొల్ల చురుకుదనం, ప్రజ్ఞను గమనించిన రాయలువారు ఆమెను సత్కరించి ప్రోత్సహించడం జరిగిందన్నారు. శ్రీకంతేశ్వరుని దేవాలయం నందు ఐదు రోజుల పాటు రేయింబవళ్లు మల్లమ్మ పద్య రామాయణంను మూడు ప్రతులుగా పూర్తి చేయడం జరిగిందన్నారు. మొదటి రామాయణ ప్రతి హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చేరిందని అప్పటి విద్యా శాఖ మంత్రి ఆదేశాలతో ముద్రణ గావించి మొల్ల రామాయణంగా ప్రసిద్ధి పొందిందన్నారు. రెండవ ప్రతి తమిళనాడులోని తంజావూరు సరస్వతీ గ్రంధాలయం మూడవ ప్రతి కడప జిల్లా సి.పి. బ్రౌన్ గ్రంధాయానికి చేరాయన్నారు. తెలుగు సాహిత్య రంగానికి మొల్లమాంబ చేసిన సేవలు, తేట తెలుగు పద్య కావ్యం మొల్ల రామాయణం, ఆమె వర్ణనా మాధుర్యం తదితరాలను స్మరించుకున్నారు. చిన్న చిన్న పదాలతో గొప్ప అర్ధం వచ్చేలా రచన చేసిన ఆమె సాహిత్య ఔన్నత్యం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర ప్రభుత్వం మొల్లమాంబ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి యం లక్ష్మి నరసింహం, కలెక్టరేట్ ఏవో ఎస్ శ్రీనివాసరెడ్డి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి. మహేశ్వరరావు, సహాయ బిసి సంక్షేమ అధికారి పి. శ్రీనివాసరావు, వసతి గృహ సంక్షేమ అధికారులు ఎ రజినీ కుమారి, బి. హేమ ప్రియా, కె.మోజస్, టి. ఆంజనీయులు, పర్యవేక్షకులు ఎస్. జయజ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ పర్యవేక్షకులు, సిహెచ్ గంగాధరం, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

● క్షేత్రస్థాయిలో సమస్యలన్నీ పరిష్కరిస్తాం ● మన గ్రామం -మన మంత్రి కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు వాసంశెట్టి సత్యం




**కె.గంగవరం,మార్చి 13 (వార్తాప్రభ) :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే ప్రభువులని,వారి అభీష్టం మేరకే కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు,రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. మంత్రి సుభాష్ ఆదేశాల మేరకు రామచంద్రపురం నియోజవర్గంలోని గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలుసుకొని తక్షణం పరిష్కరించేందుకుగాను "మన గ్రామం -మన మంత్రి" (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) పేరుతో ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే కార్యక్రమంలో భాగంగా గురువారం బ్రహ్మపురి, మసకపల్లి, భట్లపాలిక, తాళ్లపోడి,పేకేరు గ్రామాలలో సుడిగాలి పర్యటన చేసి అనంతరం జరిగిన సమావేశాల్లో వాసంశెట్టి సత్యం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత గ్రామాల్లో వివిధ శాఖల అధికారుల సమక్షంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బ్రహ్మపురి, మసకపల్లి గ్రామాల్లోని పలువురు ప్రజలు తమ గ్రామంలో వేసవి కాలంలో తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నామని, స్మశాన వాటికల్లో సౌకర్యాలు లేవని, సిసి రోడ్లు నిర్మించాలని, డ్రైన్ ల పూడికలు తీయించాలని తమ సమస్యలు విన్నవించారు.అలాగే భట్లపాలెం గ్రామంలో జరిగిన సమావేశంలో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు హాజరై సమస్యలు తెలిపారు. త్రాగునీటి సమస్యకు తక్షణం పరిష్కారం చూపించాలని, విద్యుత్ లో వోల్టేజ్ సమస్య, గృహ నిర్మాణం కోసం రుణాలు మంజూరు, ఆక్రమణలకు గురైన మంచినీటి చెరువును పరిరక్షించాలని కోరుతూ పలువురు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ఆయా గ్రామాలకు సంబంధించిన సమస్యలపై అధికారులు అంచనాలు రూపొందించి ఇస్తే, మంత్రి సుభాష్ గారి దృష్టికి తీసుకెళ్లి సమస్యలన్నీ యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి సుభాష్ శాసనసభ సమావేశాల్లో బిజీగా ఉన్నందున మంత్రి సుభాష్ తరఫున ప్రతినిధిగా హాజరైనట్లు చెప్పారు.తక్షణం మంచినీటి సమస్యను పరిష్కరించే దిశగా మంత్రి సుభాష్ తక్షణ చర్యలు గైకొంటారని వివరించారు.భట్లపాలిక గ్రామానికి జల జీవన్ మిషన్ ద్వారా రూ.1 కోటి నిధులు మంజూరయ్యా అని, ఇవి కాకుండా ఇప్పటికే రూ.25 లక్షలతో పనులు చేపట్టామని ఆర్డబ్ల్యూఎస్ అధికారులు వివరించారు.లో వోల్టేజ్ సమస్యను కూడా పరిష్కరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు.జగనన్న కాలనీల్లో జరిగిన అవినీతి అక్రమాలపై నిగ్గు తేల్చాలని కూటమి నాయకులు రవ్వా నాగభూషణం,కాటే సుబ్రహ్మణ్యంలు సభలో ఫిర్యాదు చేశారు. సమస్యలన్నీ పరిష్కరించేదుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రభుత్వ పరంగానే కాకుండా, "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" ద్వారా నిరుపేద విద్యార్థుల చదువుకు, నిరుద్యోగులకు ఉపాధి కల్పన,ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి మెరుగైన చికిత్స కోసం మంత్రి సుభాష్ వ్యక్తిగతంగా సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం మహిళలకు జీవనోపాధి కోసం కుట్టు మిషన్ శిక్షణా కార్యక్రమాన్ని అమలు చేస్తుందని ఆ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సత్యం కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు,ప్రజలు పాల్గొన్నారు.

## జనసేన జయకేతనం సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి

● మంత్రులు నాదెండ్ల, కందుల వెల్లడి



**పిఠాపురం, మార్చి 13 (వార్తాప్రభ) :** జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవంనకు సంబంధించి సభను భారీ ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు జనసేన పిఏసి సభ్యుడు మంత్రి నాదెండ్ల మనోహర్, మరో మంత్రి కందుల దుర్గేశ్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు తెలిపారు. ఈ సభకు భారీ ఎత్తున జనసైనికులు, వీర మహిళలు, అభిమానులు హాజరవుతారన్నారు. ఈ సభ ద్వారా గిరిజన, జిల్లా, పిఠాపురం అభివృద్ధిపై ఒక ప్రతినిధి ప్రసంగం చేస్తారని వారు చెప్పారు. పిఠాపురం రాజా, డొక్కా సీతమ్మ, నాయకర్ వంటి మహనీయుల పేర్లను ప్రాంగణాలకు పెట్టామని వారు చెప్పారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చిత్రాడలోని సభ ప్రాంగణం వద్ద గురువారం మాట్లాడారు. ఈ సభ పిఠాపురం మండలంలోని చిత్రాడ గ్రామంలో భారీ ఎత్తున నిర్వహించనున్నారు. శుక్రవారం జరిగే ఈ సభకు లక్షలాదిమంది జనసైనికులు వస్తారని అంచనా వేస్తున్నారు. డిజైన్లతో ఏర్పాటు చేసిన స్టేజి అందర్నీ ఆకట్టుకున్నాయి. సభకు హాజరయ్యే వాళ్ళకు కనిపించేలా పలు స్క్రీన్లను బారీ స్థాయిలో ఏర్పాటు చేశారు. ఇప్పటికే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మినహా అన్ని స్థాయిల్లో ఉన్న జనసేన నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, అరవ శ్రీధర్, పంచకర్ల రమేష్ బాబు, ఆరని శ్రీనివాస్, లోకం మాధవి, జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కృషితో 6 కిలోమీటర్ల మేర 61 రోడ్లు నిర్మాణం



**కోడూరు, మార్చి 13 (వార్తాప్రభ) :** అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కృషితో కోడూరు మండలంలో ఆరు కిలోమీటర్లు 4,41 కోట్లతో 61 సిసి రోడ్లు నిర్మాణం చేశామని కోడూరు మండల పార్టీ అధ్యక్షులు మర్రె గంగయ్య తెలిపారు. గురువారం కోడూరు, తూర్పు వైపున,మేరక గౌడ పాలెం నూతనంగా నిర్మించిన సీసీ రహదారులను స్థానిక జనసేన నేతలతో కలిసి పరిశీలించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం ఏడు నెలల్లో 61 రోడ్లను నిర్మించి చరిత్రను సృష్టించారన్నారు. స్థానిక జనసేన నాయకులు పాల్గొన్నారు.

## గుడివాడలో పది పరీక్షలకు 2,800 మంది విద్యార్థులు.. ఎంఇఓ బాలాజీ



**గుడివాడ,మార్చి 13 (వార్తాప్రభ) :** ఈ నెల 17వ తేది నుండి 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గుడివాడ అర్బన్, రూరల్‌లో 15 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి బి. బాలాజీ తెలిపారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్యీవో బాలాజీ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలు ఈ నెల 17వ తేది నుండి 31వ తేది వరకు జరుగుతాయన్నారు. గుడివాడ, టౌన్, రూరల్ మండలం లో 15 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూరల్ మండలంలోని మోటూరులోని గురకుల పాఠశాలలో ఒక (1) సెంటరు, అర్బన్ పరిధిలో, పట్టణంలో 14 సెంటర్లు ఫాదర్ బియంకీ, మాంటిస్సోరీలలో 2 సెంటర్లు, ఏజికె, ఎస్‌పిఎస్, నలంద, ఎకెటిపి, విశ్వభారతీ, విద్యాలయ, త్రివేణి, హోలీ క్రాస్, ఉషోదయ, బేతవోలులో జరుగుతాయన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9గ॥30ని॥ల నుండి మధ్యాహ్నం 12.45ని॥ల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. 15 సెంటర్లులో సుమారు 2800 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతునట్లు పేర్కొన్నారు. 15 సెంటర్లులో అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు, సిఎస్. డివో, ఇన్విజలేటర్లు మొత్తం 170 మందిని నియమించడం జరిగిందన్నారు. ఓపెన్ 10వ తరగతి పరీక్షలు ఏజికెలో ప్రత్యేకంగా 1 సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షకు సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. పరీక్షలకు సక్రమంగా నిర్వహించేందుకు అధికారుల సూచనల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎమ్యీవో బాలాజీ తెలిపారు.

## నయనానందకరంగా కూచిపూడి నృత్యాలు..




**అవనిగడ్డ,మార్చి 13 (వార్తాప్రభ) :** కూచిపూడి నాట్య శిల్పారామం , శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంల సంయుక్త ఆధ్వర్యంలో స్వామివారి 262వ వార్షిక కళ్యాణ మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు గురువారం కొనసాగాయి .కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుగ్రహిత పసుమర్తి రత్తయ్య శర్మ శిష్యుడు నాట్యాచార్య మాదు కోమలబాబు శిష్యులు ప్రదర్శించిన అంశాలు పూర్వ సాంప్రదాయంలో కొనసాగి ఆహూతులను అలరించాయి .కోమల సమన్విత కూచిపూడినృత్యాలయ (హైదరాబాద్) విద్యార్థులు గుండారపుకౌశిక, మంతెన శృతి ప్రియాంక, ఎలకంటి చైత్ర, గుడిపాటిదిషిత, కాళ్ళ యాక్షిక, సుధ లతోపాటు కోమల బాబు కలిసి ప్రదర్శించిన వినాయక స్తుతి తాండవ నృత్యకరి (మోహన-ఆది), రామ శబ్దం (మోహన-ఆది), జతికట్టు (ఆది-మోహన,భైరవి) రామాయణ శబ్దం (రాగమాలిక -ఆది,) పూజా నృత్యమైన బ్రహ్మాంజలి (రాగమాలిక-ఆది), కృష్ణ శబ్దం (ఆది -మోహన)లను తమ పరిధుల మేరకునర్తించి ప్రేక్షకులనుఆనంద పరవశలను చేశాయి. ఈ అంశాలకు నాట్య గురువు పసుమర్తి రత్తయశర్మ నట్వాంగం నిర్వహించగా ముట్నూరి పావని, మృదంగంపై పసుమర్తి హరినాధ శాస్త్రి వైలెన్ పై పాణ్యం దక్షిణామూర్తి సహకరించారు. ఈ సందర్భంగా కళాకారులను డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, దేవాలయ పాలకమండలి సభ్యులు సత్కరించారు

## దివ్యాంగుల గురించి అంగన్వాడీ లకు శిక్షణ..



**పెనుగంచిప్రోలు,మార్చి 13 (వార్తాప్రభ) :** పోషణ్ బి పడాయి బి కార్యక్రమము ముండ్లపాడు జడ్పీహెచ్ హైస్కూల్ నందు పెనుగంచిప్రోలు మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు సిడిపిఓ వ్యాంగు లక్ష్మీ భార్గవి ఆదేశాల మేరకు మూడు రోజులు శిక్షణా కార్యక్రమం జరిగింది, ఈ శిక్షణా కార్యక్రమంలో నవచేతన దివ్యాంగుల గురించి శిక్షణ ఇవ్వడం జరిగింది, సున్నా నుండి మూడు సంవత్సరాల పిల్లలకి ఎలా చెప్పాలి తల్లులు సంరక్షకులు ఎలా వారిని ఆక్టివిటీస్ చేయించాలి,కార్యక్రమాల గురించి ఇంకా దివ్యాంగుల గురించి ఎలా గుర్తించాలి,వారిని ఎలా సహజ స్థితికి తీసుకురావాలి అని వివరంగా చెప్పినారు సూపర్వైజర్ ఉషరాణి, సువర్ణ లు అంగన్వాడీల కు శిక్షణ తరగతులు నిర్వహించినారు.

## అన్నదానం కు 10 వేలు విరాళం..



**పెనుగంచిప్రోలు,మార్చి 13 (వార్తాప్రభ) :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో జరుగు అన్నదానం కువాసిరెడ్డి సాయి సాగర్ ధర్మపత్నీ రామసీత ఖానపురం ఖమ్మం జిల్లా తెలంగాణవాస్తవ్యులు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానము అన్నదానమునకు రూ.10.000 (పదివేల రూపాయలు) విరాళంగా సహాయ కార్యనిర్వహణదికారి తిరుమలేశ్వర రావు కు అందజేయడం జరిగింది. వారికి దేవస్థానం తరుపున దర్శనం కల్పించి ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలు తీర్థప్రసాదాలు అందించడం జరిగింది.

## కృష్ణా యూనివర్శిటి వైస్ ఛాన్సలర్ రాంజీ సేవలు అభినందనీయం

● కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు



**గుడివాడ,మార్చి 13 (వార్తాప్రభ) :** నూతనంగా నియమించబడిన కృష్ణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కూన రాంజీ గారిని మచిలీపట్నం కృష్ణ విశ్వవిద్యాలయంలో గురువారం మధ్యాహ్నం కళింగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు మర్యాద పూర్వకంగా కలిసి ప్రొఫెసర్ రాంజీ గారిని సత్కరించడం జరిగినది. ఈ సందర్భంగా మజ్జాడ నాగరాజు మాట్లాడుతూ వైజాగ్‌లో అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా రాంజీ అందించిన సేవలు చాలా అభినందనీయమని.. అలాగే ఇప్పుడు మన కృష్ణ విశ్వవిద్యాలయంలో మరెన్నో అభివృద్ధి సంస్కరణలు చేసి, విద్యార్థులకు విశ్వవిద్యాలయానికి మంచి గుర్తింపు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ రచయిత దర్శకుడు గూన అప్పారావు, కళింగ ఐక్య సేవా సంఘం గౌరవ అధ్యక్షులు సూర నరసింహారావు, అగస్తి రాము, డాక్టర్ పూడి కిరణ్, తమ్మినేని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పెదప్రోలు నాంచారమ్మ అమ్మవారి జాతరకు ఏర్పాట్లు పూర్తి...



**మోపిదేవి/అవనిగడ్డ,మార్చి 13 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా మోపిదేవి మండలం పెదప్రోలులో వేంచేసియున్న శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.శుక్రవారం ఉదయం గంగానమ్మ కొలుపుతో ఉత్సవాలు ప్రారంభమై శనివారం రాత్రి అమ్మవారి పవలింపు సేవతో ముగుస్తాయి.పక్షం రోజులు ముందు నుంచే నాంచారమ్మ అమ్మవారి గ్రామోత్సవం సాంప్రదాయబద్ధంగా కొనసాగుతుంది.ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.సినీ నేపథ్య గాయని మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నారు.పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు రానుండటంతో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆలయాన్ని విశేష అలంకరణలతో ముస్తాబు చేశారు.శుక్రవారం ఉదయం నుండే భక్తులకు అమ్మవారి అన్నప్రసాదం పంపిణీ చేసేందుకు ఆలయ కమిటీ ప్రతినిధి కూరపాటి కోటేశ్వరరావు ఏర్పాట్లు పూర్తి చేశారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు..




**విజయవాడ, మార్చి 13 (వార్తాప్రభ) :** సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంగ్ ఆధ్వర్యంలోఅంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను విజయవాడ డివిజనల్ రైల్వే ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగాడివిజన్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి నుస్రత్ ఎం. మంద్రు ప్కర్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు అన్ని రంగాల్లో నేడు రాణిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలని హక్కులతో పాటు విధుల కు కూడా సమ ప్రాధాన్యత ఇస్తూ రైల్వే ల ప్రగతిలో భాగస్వాములు కావాలని అన్నారు. రైల్వే ఆసుపత్రి డిఎంఓ డాక్టర్ లీల మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నారని తాము నిర్వహించే విధుల పట్ల మరింత అవగాహన పెంచుకోవాలని ఒకరిపై ఆధారపడే పరిస్థితి రాకుండా ఎదగాలని సూచించారు. డాక్టర్ షాహిదా మాట్లాడుతూ మహిళలు తమ సమస్యల పట్ల ఉదాసీనంగా ఉండకుండా పరిష్కారానికి సంబంధించిన అధికారులు నాయకులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. డివిజనల్ అధ్యక్ష కార్యదర్శులు ఆమంచి వెంకటేశ్వరరావు అకుల రాఘవేంద్ర లు మాట్లాడుతూమహిళా ఉద్యోగుల సమస్యల పట్ల ఎంప్లాయిస్ సంగ్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు చే సాంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు,మహిళా కార్మికులను సత్కరించారు. జోనల్ కోఆర్డినేటర్ రాధిక సుప్రియ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబ ర్లు రమేష్, దేగల శీను , సిఅండ్ డబ్ల్యూ బ్రాంచ్ కార్యదర్శి కర్నూల్. సుకుమార్,ఇంజనీరింగ్ బ్రాంచ్ కార్యదర్శి శ్రీనివాసరావు, మెడికల్ బ్రాంచ్ కార్యదర్శి శ్రీనివాసరావు ,, టి ఆర్ డి బ్రాంచ్ కార్యదర్శి శ్యామ్ బాబు, ఈ ఎల్ ఎస్ బ్రాంచ్ కార్యదర్శి బసపున్నయ్య,టికెట్ చెకింగ్ బ్రాంచ్ కార్యదర్శి బాలాజీ, ఇంజనీరింగ్ బ్రాంచ్ చైర్మన్ కొయ్య రమణా రెడ్డి, రాఘవులు అధిక సంఖ్యలో మహిళ కార్మికులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188